పద్యకవిత్వం

బృందావనగానం



డా. సూరం శ్రీనివాసులు

బృందావనగానం



డా॥ సూరం శ్రీనివాసులు

Brindavana Gaanam

Telugu Prosody

Dr.Suram Srinivasulu

e book

2026 July

ISBN: 978-93-5933-165-2

DTP: Dr. PBDV Prasad
Layout: Vittu Babu

Address
Dr. Suram Srinivasulu
Plot No.24, 4th Mile Center,
Shirdi Nagar, Near Masjid,
Navalakh Garden, Nellore - 524002
Andhra Pradesh.
Cell: 9440242348

బృంద-అవన-గానం

జెన్.జి.(Gen Z) తరం వాళ్లకు ఏ మాత్రమూ తీసిపోకుండా సాంకేతికతను, ముఖ్యంగా వాట్స్‌యాప్‌ను వినియోగించుకొన్నవారిలో వివిధ రంగాలలో పని చేసి విశ్రమించిన సాహిత్య నిర్మాతలూ, సాహిత్య విమర్శకులూ కూడా చేరుతారు. సాహిత్యంలోని ప్రాచీనమైన పద్యనిర్మాణ విద్య ఈ వాట్సాప్ బృందాలలో కదను త్రొక్కింది. కవిత్వాన్నీ, భక్తినీ, ఆధ్యాత్మికత అనబడే ఒకవిధమైన ధోరణినీ కలిపి పద్యాలను గుప్పించి, బృందాలను సుసంపన్నం చేశారు రచయితలు.

ఉమ్మడి కుటుంబాలలోని వాతావరణం ఈ బృందాలలో కనిపిస్తుంది. అటు లాభం, ఇటు నష్టం; అటు స్నేహం, ఇటు ద్వేషం; అటు ప్రేమ, ఇటు అసూయ... ఇలా ఎన్నెన్నో అనుకూల ప్రతికూల భావబంధాలు ఈ బృందాలలో కనిపిస్తాయి. ఉమ్మడి కుటుంబాలలోని పెద్దరికాలూ, పెద్దరికాలపై తిరుగుబాట్లూ, ఏడుపులూ, ఓదార్పులూ, అలకలూ, ఆక్రోశాలూ అన్నీ బృందాలలో విలసిల్లి బృందగానాలు చేస్తుంటాయి. వాటి స్వరూపనిరూపణ వాటికి రక్షణకవచంగా ఉంటుందన్న ఆలోచనతో చేసినదే ఈ బృందావనగానం. బృందాల విశ్వస్వరూపాన్ని ఇది పూర్తిగా దర్శింపజేయలేకపోయినా నా దర్శించిన రూపంతో మీ ఎదుట నిలిచినదే ఈ బృందావనగానం. దీనిలోని గుణాలు బృందసృష్టి. దోషాలు విమర్శకదృష్టి. అంతే....

- డా. సూరం శ్రీనివాసులు

బృందావనగానం

వాట్సాప్ బృందాలను, బృందగానగతులను గురించి సరదాగా,
వాస్తవంగా, గ్రుచ్చుకున్నా గాయం కానంతగా...

బృందావనగానం--1

బృందావనగానమ్మిది
బృందావనగానగతిని వేణురవములున్
నందవధూగోపవధూ
నందనములు గాన ; ముట్టి నయవర్తనలే

ఇది యొక వినోదవేదిక
యిది యొక విజ్ఞానసర్వ మిది యొక సుషమా
పద మిది సుకళాసంప
త్ప్రద మిది బృందైకజీవపథవిశ్వమ్మున్

అలసులకు మందమతులకుఁ
బొలుసులకుం దావులేక పూర్ణత నగరీ
వలయమ్ములఁ గనుగానమి
విలయమ్ముగఁ దోచు పుణ్యవేదిక లివియే

అరచేతను వైకుంఠ
మ్మరుదుగ లభియించినట్టు లసదృశమమతా
భరమతులు చేరి కొందరు
పరులను నడిపించి బృందపథమునఁ గూర్తుర్

6-10-25

బృందావన గానం - 2

తెలుపవలె శుభోదయములు
దెలుపన్ వలె "శుభపగళ్ళు" దెలివిడి రేలున్
దెలుపుటలోఁ బొరపాటులు
కలిగించు నసత్యవచనకథనమ్ములనున్

ఏమారిన నేమాడిన
నేమనినన్ దొసఁగు గలదె! ఏ ఐ తోడన్
సామాన్యమె దోషమ్మని
ధీమాగాఁ బలుకవచ్చుఁ దేజము నచ్చున్

వాటముగాఁ బ్రదికినచో
నోటమి లే దిచట ; నున్న నోటిన్ మాటన్
దీటుగ వినియోగించిన
మీటున్ శారదయు వీణమెట్లన్ గట్లన్

తిలకాష్టమహిషబంధము
లలకలు చెలరేగనట్టి యారోగ్యరహా
స్యలతలు గతుకులు ముక్తికిఁ
బిలకలు సర్వమ్ము దొరుకు బృందమ్ములలో

7-10-25

బృందావన గానం - 3

నీతుల కుప్పలు, సద్యో
భ్రాతల నఘమర్షభక్తిరచనలు, విద్వ
జ్జేతల పరహితసూక్తులు,
చేఁతల శూన్యతలు బృందసిద్ధాన్నంబుల్

పలికెదను సత్య మొక్కటి;
విలువైనవి వివిధవిషయవృందము ; లైనన్
గళ తెలిసి వాడువారలు
కలరని నమ్మకమె ; కాని కలరో? లేరో?

కొనసాగింపులు నేర్చిన
ఘనతన్ వహియింపవచ్చుఁ గడకడ మాటల్
మనవగు ; తొలిభావనలా?
జనముల బిచ్చములె ; యదియ సాధకపథమౌ

ప్రాతఃకాలపు వాయస
రీతిం గాకాల పట్లు ; బృందపుఁ గట్లున్
బ్రీతిగ నెఱుఁగంగవలెన్
వ్రాతీనుఁడవై యెసంగవచ్చును దానన్

8-10-25

బృందావన గానం - 4

బొమ్మలతో మర్యాదలు
కమ్మగఁ గనిపించుఁ గొంతకాల మ్మాపై
దమ్మునకుఁ జాల వయ్యవి
చమ్మగ నుడిపొగడికలకె చాతురు చేతుల్

చేయెత్తుచు జై కొట్టఁగఁ
జేయిన్ మున్ముందె చాపి సిద్ధకరు లిటన్
దాయులుగాఁ గొండొకచో
దాయలుగా నుండ్రు బృందతత్త్వమనీషన్

పలుకు వలె ధన్యవాదము
లెలమిన్ స్పందించువారి కెంతయొ ప్రీతిన్
దెలుపమిఁ జెయితీరక యది
తొలకరి వలె నలుకలకును దోఁడగుచుండున్

కొందరు గిల్లుచు నుందురు
స్పందన లను పేర ; వారి ‘సౌజన్యమ్మున్’
దొందరపడి తెగనాడుట
ముందరికాళ్లకును బంధముగ నది మారున్

09-10-25

బృందావన గానం - 5

స్పందనల పేర శశ్వ
న్మందీకృతబుద్ధినైన మధురకవిత్వా
నందప్రదధీనిధి యని
యందముగా నొక్కి మ్రొక్కి యలరింపవలెన్

పొగడినవాఁడె ఘనుండని
పొగడికయే ప్రాణమనియుఁ బొంగుచు వారిన్
దెగఁ బొగడవలెను బగ యను
వగ యను భేదంబు లేక వాఁచినయట్లె

మనతలపులఁ బులకింతల
ననువుగఁ దెలుపంగఁ దగిన వందరిసొత్తై
చిని చిని బొమ్మలె ; వానిం
బనిఁ గొని నేర్వంగవలయుఁ బదుగురితోడన్

అలనాటి చిత్రలిపియే
వెలసిన దీనాఁడు గూడ విధిగా నేర్వన్
వలె బృందప్రముఖుండై
నలుగురిలో నాగరికత నవతన్ జూపన్

10-10-25

బృందావన గానం - 6

బృందంబులలోఁ దగు నుప
బృందంబులు కొన్ని ; వాటి ప్రేళ్ళు నిటారుల్
సందడి సర్వావస్థల
నందరిఁ దొలఁగించి పోవు నారాటముతోన్

చేరీ చేరకముందే
చేరిమికై శిష్యతతినిఁ జేర్పఁగవలయున్
వారే కద వార్(war) వేళల
ధీరాయతధిష్ణ్యులగుచుఁ దెగఁబడువారల్

పద్యముఁ బెట్టిన వెంటనె
సద్యోగర్భమ్ము పగిది సాధువచస్సుల్
పాద్యము ; లుపబృందంబుల
మాద్యద్గతి కదియ మూలమంత్రం బచటన్

క్రొత్తగఁ జేరినవారలు
మొత్తమ్మున్ దున్నివేసి మురియుచుఁ బైఁబైఁ
గ్రొత్తగఁ జూతురు గనలే
రత్తారింటికిని దారి యాత్రమువలనన్

11-10-25

బృందావన గానం - 7

నీకై యొకరో యిద్దరో
వాకొనువా రుండవలెను వాచాలురు చీ
కాకైనను వారలపై
నీకుండఁగవలెను సతము స్నిగ్ధత మదిలోన్

అడ్మినుబృందముకొఱకా?
యడ్మినుకయి బృందజనుల? యను విచికిత్సల్
బాడ్జెండు లున్నవారికె;
గుడ్మామెంటున్నవారు గొణగరు గరులై

పూనిన నియమం బొకపరి
యైనన్ విడనాడకున్న నర్హుండగునే
న్యాయముగా నడ్మినుగా
'సాయంగల' విన్నపాలు 'సాయన్' గాయన్

తన ఫోటో 'పరఫోటో'
యను భేదము నెఱిఁగినపుడె యత డడ్మినుగాఁ
గొనసాగఁ దగును గానీ
ఘనమా? సమదృష్టినుండఁ గలుగుట సతమున్

12-10-25

బృందావన గానం - 8

బృందంబుల నడిపింపఁగ
నుందురు పిడికిలి బిగించి యుత్సాహమతుల్
కొందరు ; వారల కదియే
మందైనను విందు లైన మద్యంబయినన్

అడ్మినులనబడువారలు
బాడ్మోటో లేనివారు పదుగురితోడన్
గుడ్మార్నిం గనిపింతురు
గాడ్మేడులు వారు లోకకళ్యాణార్థుల్

నంబరు తెలిసినఁ జాలును
సంబరముగ జేర్చి బృందసంఖ్యను నిరతం
బంబర మంటఁగఁ జేయుచుఁ
దాంబూలము లిచ్చువాఁడె తగు నడ్మినుగా

తనతోడిదె లోక మ్మని
యనుకొనవలె సభ్యులెల్ల రహమున నిశలోన్
గణములు గుంపుల కూడికఁ
దనదే పైమాట నాగఁ దగఁ జెలఁగవలెన్

13-10-25

బృందావన గానం - 9

కొందరిని గిల్లుచుండుట
కొందరితోఁ జతురులాట కొందరితోడన్
మందముగా నందముగా
విందులవలెఁ బలుకుచుంట వెల యడ్మినుకున్

అలుకలు సహజాతమ్ములు
గలనైనన్ సుంతయేని కనఁబడవేనిన్
విలువలు నిలువవు గావునఁ
గళ తెలియఁగ నలుగుచుంట కళ యడ్మినుకున్

అనునయరతులగు సభ్యులు
కనిపించిన యపుడె యలుగఁ గలుగుట మమతా
జనితానురాగబంధం
బును నిలుపుకొనంగఁజాలు పోడిమి యగుఁగా!

మెచ్చఁగ లేదని యెవ్వరు
నచ్చముగా నలిగిపోయినట్టి జనాలన్
గ్రచ్చర రాబట్టుటయే
ముచ్చట యడ్మినుకు బృందమునకుం గడకున్

14-10-25

బృందావనగానం-10

సందట్లోన సడేమియ
యందురు కొందరిట బృంద మందున నక్షి
న్లందరి బ్రతుకుల దూరుట
నందంబని వారలెంతు రక్షిను లగుటన్

నైమిశమున నిజభక్తుల
ధీమత్తను భక్తి బెంచఁ ద్రిప్పెడి గురువుల్
సామాన్యుల? వారలతో
నీమాత్రము దగర? పోల్చ నీ యక్షినులున్

ఒక యక్షిను గణమాన్యుఁడు
నొక యక్షిను సుగుణమాన్యుఁ డొక యక్షిన్నో
ప్రకటితగణగుణమాన్యం
డిఁక నలవియె వారి సేవ లెంచి నుతింపన్

సామాజికకర్తవ్య
శ్రీమత్తగ బృందములను సృష్టించి జగత్
క్షేమము సంపాదించెడి
ధీమంతులు గూడఁ గలరు దిగిభాక్షినులన్

15-10-25

బృందావన గానం - 11

ఏ యూరు చూడఁ దలఁచిన
నా యూరన్ గల్గు సభ్యులందరితో నా
ప్యాయతలను గురిపించుచు
హాయిగఁ జరియించువాఁడె యడ్మిన్ వరుఁడౌ..

గురు వనిపించుకొనంగన్
సరదాకయినను వివిక్తశాస్త్రతకయినన్
వరమొక్కటి ; బృందమ్ముల
నేకాడ్మిను గాఁగనుంట యేకాడికినిన్

బృందమ్ములు పీఠమ్ములు ;
బృందాధిపు లెల్ల గురులు ; బృందప్రాప్తిన్
కొందరు నుపగురువులు వా
రందరు మనవంటి వారి కార్యుల్ ధార్యుల్

శతకమ్ములు వ్రాయించను
బతకమ్ముల నిడుచుఁ గృతులఁ బస లందింపన్
గృతవిద్యులు నడ్మినులై
కతలన్ బల్కుదురు సార్థకత చేకూరన్

16-10-25

బృందావన గానం - 12

స్తవములకు వాస్తవములకుఁ
గవలకు జక్కవలకును వికల్పితమతులన్
లవలేశమైన భేదము
లవుపించవు బృందగతుల ; కవి ప్రేరకముల్

ఒకచోట నొకరిపేరను
నొకచో నింకొకరిపేర నుండెడి కవితల్
ప్రకటముగాఁ గనిపించుట
యకటా! యిది గారడీయ యగు బృందములన్

కొందరి యాదృచ్ఛికతలు
కొందరి సమభావనములు కొందరి తుల్య
స్పందనములు గిలిగింతల
కందువలై బృందములను గానఁగవచ్చున్

వ్రాయుట పేరుం గొనఁగాఁ
ద్రోయుటయును ముందు ముందుఁ దోఁచినయంతన్
న్యాయమ్ములె బృందమ్ముల
నాయమ్ములె యెత్తిపోతలై యలరారన్

17-10-25

బృందావన గానం - 13

పారస్పరికస్పందన
వీరోచితకృత్యమగు నవీకృతచేత
స్ఫారతకున్ జనసూయా
ధారతకున్ హేతువగు సదాశివమూర్తిన్

బృందమ్ములఁ జేరుటయే
యందఱఁ దాత్త్వికులఁ జేయు నవుఁగాములలో
మ్రందుచుఁ జిందరవందర
సందిగ్ధత దుంపఁ ద్రెంపఁ జాలుటవలనన్

వచ్చుటకే పోవుట లట
వచ్చుట పోవుటకొఱకట వంతల నయినన్
ద్రచ్చిన సారమ్మిది వి
వ్వచ్చున కలనాటిబోధవలె బృందములన్

స్తబ్ధతఁ గొందరు ; డేటా
లుబ్ధత మరికొంతమంది ; లోలుపమతివి
స్రబ్ధతఁ గొందరు ; బృందా
రబ్ధతఁ మరికొంతమంది రచయితృకుబ్జల్

18-10-25

బృందావన గానం - 14

చెలరేఁగి రేఁగుపండ్లం
బులువలె బృందమ్ము చెఱపి మురిసెడు మొగమై
తలవాకిట నిలచినచో
నలువయు గసపెట్టఁ గడఁగు నలుమోములతోన్

చింతానిధులై కొందరు;
చెంతను జీపురుల లేమి సిరి నూడ్వకయే
కంతల వెదకుచుఁ గొందరు;
చింతాకంతయును వెఱపు సేరదు వారిన్

ఒకఁడొకఁ డొక్కొక్కఁడుగా
నొక వలఁ బడియున్న చేపలో యనఁ గిలలన్
దకరారు లేకయున్నను
వికృతపుఁ బోబడులఁ బోయి విసిగింతు రిటన్

తెలివిడి విడియే యయినం
దెలియమి సెబ్బరయుఁ గాదె! తెలిసి పలికినన్
గలనయినం గళనయినం
బులకింతలు వుట్టి బృందములు రాజిల్లున్

20-10-25

బృందావనగానం -15

ఆగఁగలే రొక నిముసము
నాగమ్ముల నాపలేరు హాహాహీహీ
యోగాభ్యాసముఁ జేయుచు
వాగమృతపు సిద్ధి బృందపరివృతు లిచటన్

సూటిగ వారికి వీరికి
వాటముగా ముందుమాట వ్రాయఁ దలఁచినన్
మాటికి మాటికిఁ బ్రేముడి
దీటే లేనట్లు వారిఁ దెగఁ బొగడవలెన్

ఇహమో పరమో తెలియని
యహముం గన్పట్టుఁ బ్రోడ లగువారలలో
సహనము సెడి పెడసరములు
విహరించుచు నుండు బృందవిధివీథులలో

సాంకేతిక విజ్ఞానము
జంకక లోఁగొన్నవారు ఛాందసులే ; పల్
వంకలఁ జూచు పురోగతు
లింకెక్కడఁ బోరఁ గలరు హేత్వర్థములన్

21-10-25

బృందావన గానం - 16

కాటుకలా ? సకలకళా
వాటికలా? కలలఁ దేరు వాడుకలా? యా
రాటము దగులమ్మో ప్రియ
వీటికలా? బృందముల వివేకపుఁ బాటుల్

సుందోపసుందులుందురు
కొందరు బృందముల జనుల గుణగణఘృణులన్
జిందరవందరఁ జేయుచుఁ
గొందలమును గూర్చఁ జెడుపఁ గొస కందరినిన్

వాటముగాఁ బలువురితోఁ
బోటీగా స్వీయమేధఁ బొంగించుచుఁ డీ
కాటవి నిజవైభవమే
మీటగ మితిమీరు బృందమితి యచ్చెరువే ?

సరుకున్నను లేకున్నను
సరదాగా కొట్టు తీసి సవరించినటుల్
పరిపాటిగ బృందమ్ముల
నురుకుటయే హితము బ్రతికియుండఁ దలఁచినన్

22-10-25

బృందావన గానం - 7

ఒక విప్లవకవి పుట్టిన
నొక వందగ భక్తకవులు నుబుకుచు వానిన్
గికురింపఁ జాలు నకటా
నెకసెక్కెమె బృందముల నభీప్సితవృద్ధుల్

మతవాదుల సాహసమున
హితవాదులు జంకుచున్న యీ బృందములన్
మితహితగతి కష్టంబే
కృతమతు లెవ్వారికైన నీ రోజులలో

నలుగురు గూడిన తావుల
నలుఁగులుగా నుండవలసినట్టివి బృందాల్ ;
కలచెడి కలఁబడుచున్నవి
బులుపెక్కిన రాజకీయముల నర్తనతోన్

బృందములం గోవర్టులు
నుందురు మతరాజకీయ మూపందుకొనన్
దొందరపడ కష్మిను లా
సుందరబృందారకులను శోధింపఁ దగున్

23-10-25

బృందావన గానం - 18

ఒకదొసఁగునె యనుదినమును
నకలంకితఁ జేయఁ గలుగు నార్యజనాళిన్
నికరముగాఁ గనఁగలుగుట
యకటా! బృందముల యందె యఘమర్షణతన్

తెలుఁగునఁ బండితు లయినం
దెలియరు పదశుద్ధి నొకఁడు తెలుపఁ దలఁచినన్
బొలఁగొనెడి యాభిజాత్యము
తలవాకిట నిలుచు నట్టి తల్లినిఁ దెగడున్

ఒకఁడు పెడద్రము లోఁగొన
నొకటేమిటి వెట్టికేక; లూపుల యుడతై
లుకలుకలౌ తలఁపులతో
సకలమ్మును గొఁటికివేసి సంతోషించున్

పేనులవలెఁ బెత్తనములు;
దీనుల వలె వినయనటన; దిసమొలతోడన్
జ్ఞానసహస్రాధికసం
ధ్యానయజేగీయమానతాత్త్వికకృతులున్

24-10-25

బృందావన గానం - 19

దీవ్యద్విద్యుత్ఖాస్వ
ద్ధవ్యత్కవ్యత్కవిత్వదహరాకాశత్
నవ్యత్రాచీనత్వద
భవ్యత బృందములఁ జెలఁగు భావపు లేమిన్

విని యూరక యుండుటకున్
జనులంతటి వెట్టివార? చక్కగ నర్థం
బును దాత్పర్యము నీవే
వినిపించఁగవలయు నండ్రు వెన్వెంట వెసన్

అసమర్థత వాల్మీకియు
రససిద్ధి జనించు వరకు వ్రాయుట లాపెన్
బస లెఱిఁగిన మన మేటికిఁ
గసి వ్రాయక యాగవలయుఁ కలిధార్మికతన్

అనునిత్యకవిత్వోద్యమ
ఘనచరితములంట బృందగతు ; లది కన నే
రని ప్రాచీనులు జన్మం
బున కొకటో రెండో వ్రాసి మురిసిరి కృతులన్

25-10-25

బృందావన గానం - 20

రచనములును నాధ్యాత్మిక
పచనములును వైద్యశాస్త్రవచనము లౌరా!
వచనీయ మేమి గలదిట?
కచశుక్రవినీతిఁ గొంత కలఁతయె కానీ!

ఒకఁ డుసిరికాయపచ్చడి
నొకఁ డుమ్మెతకాయపులుసు నొక్కఁడు వేముం
బ్రకటించును సర్వముగా
నిఁకఁ గోరును 'లైకు' లెన్నొ యింటన్ బయటన్

గింజలనే తినవలెనని
గుంజుడు లొకచోట, నాన్చుకొని మొలకలనే
నంజవలె ననుచు నొక్కట
వింజామర వీచినట్లు వృందవిహరణల్

స్పందనలు తెలియఁ జేయుట
కుం దగు పద్ధతులు గలవు కొందరి కడనే
యందరకు నేర్ప బృందము
లం దీర్పఁగవలయు బోధలన్ రుచిపొంటెన్

26-10-25

బృందావన గానం - 21

చిన్నప్పటివో మతిచెడి
యున్నప్పటివో వివేక ముండియు లేన
ట్లున్నప్పటివో రచనల
నన్నింటినిఁ బంపిణీకి నమరించవలెన్

కథలో కాకరకాయలో
వ్యథలో స్తోత్రములో వాదప్రతివాదనలో
మథితములైన మనస్సులో
విధిగా బృందోత్సవముల వేడుక లయ్యెన్

రచియించుట ప్రచురించుట
లుచితమ్మే ముందు వెనుకలున్నను, నేఁడో!
రుచి నెఱుఁగుట వ్రాయుటయుం
బ్రచురించుట తుల్యకాలప్రారబ్ధమ్ముల్

తనకుం దానే కర్తయుఁ
దనకున్ మెచ్చరియుఁ దానె తనివారంగన్
దనవారుఁ దగిన వారలు
'తని'గా భజనైకపరతఁ దలరినఁ జాలున్

31-10-25

బృందావన గానం - 22

పిజ్జా బర్గరు పూరీ
మజ్జిగలో ముంచి తినినమాదిరిఁ దమితోఁ
గజ్జాయమ్మును టీతో
గుజ్జుగఁ దినినట్లు చేవఁ గొను బృందమ్ముల్

జ్ఞానములో నజ్ఞానము
జ్ఞానము నజ్ఞాన మందు జతపడియుండున్
విజ్ఞుల బృందమ్ములలోఁ
బ్రజ్ఞకుఁ బరకాష్ఠ యనఁగ భాసిలుచుండున్

నెలవులు పసిచేఁతలకును
నెలవులు వైరాగ్యభావనటనార్భటికిన్
నెలవులు ముక్తాయింపులఁ
బొలమారిన తలుపులకునుఁ బొరి బృందమ్ముల్

వినయమ్మును నటియించుట
యనయమ్మును లోననున్న యహమును దాచన్
గొనయమ్ము విడిచి వింటినిఁ
గొని, మొనతో గ్రుచ్చినట్లు కొనసాగుటలున్

01-11-25

బృందావన గానం - 23

ప్రతిదినము నొకటొ రెండో
యతిగా స్పందించి యున్నవన్నియుఁ గుతితో
నతికించిన బృందములకు
బ్రతుకేమగుఁ బాఠకులకు ? బలిపీఠమ్మా ?

అలనాటి యాటవికులకు
వలె బృందము లున్నఁ గట్టుబాటులతోడన్
విలువే ; యెదుగుందలలకు
శిలువే ; గిరిగీసుకొన్న చెయ్దము లవియే

ఏ కట్టుబాటు లేమిన్
వీఁకం జెలరేగిపోవు విజ్ఞులతోడన్
జీకాకె కాని యుచిత
ప్రాకటికత లేని వేళ వ్యథ మౌనమ్మే

వైయక్తికక్రమశిక్షణ
సాయమ్మును జేయు బృందసక్రమగతికిన్
దాయిలమే యది, కానీ
యే యనువుననైనఁ గానమే యద్దానిన్

02-11-25

బృందావన గానం - 24

అఱకొఱ నఱిముఱి మఱిమఱి
మఱుఁగునఁ బడియున్నయట్టి మాటల తీఁతన్
మెఱుఁగులునాఁ గైతలలోఁ
దఱఁకల సమకూర్చి పంపి తనియఁగ వలయున్

ఆనాటి తాటిచాపలె
యీ నాటికి వాటుసాపు లిఁక నిర్భీతిన్
దానం దీనం బనిగొని
గానంబడి కానఁబడిన గతిఁ జెలఁగఁ దగున్

అరమరికలో 'తృణగరికలో'
కరిమరకలో కలుగులోనఁ గల యెలుకలో వా
విరిఁ గొని బృందంబులలో
నురుకుటయే హితము బ్రతికియుండఁ దలఁచినన్

మహనీయులు వుట్టిరి ప్ర
త్యహమున్ బృందములయందు నతిగఁ గవిత్వం
బు హఠాజ్జాతముగా వ్రా
సి హరింపన్ ; లోటు గలదె సిడికిం గథకున్

06-11-25

బృందావన గానం - 25

పుట్నంపప్పుమసాలా
కట్నముగా నిచ్చి , వినిచి, కవితల ; లోలో
రాట్నపు గతిఁ దెగ మిడియుట
మ్యాట్నీదర్శనము బృంద మధురిమ లందున్

మిడియుటయు నిక్కి నీల్గుట
వడిఁ బరుసము లాడి మొగమువైపునఁ గసితో
సడి మెటికలు విరుచుటయును
జడుపింతయు లేని బృందచారుల వరుసల్

ఎంచినదానిపయిన్ గురి ;
గొంచెము గానట్టి తెల్వి ; కూలిన చోటన్
వంచనమతిఁ గొనకొనమియుఁ
బంచాయతనంపుఁ బూజ పలు బృందములన్

సగ మీవు వ్రాయ మిగిలిన
సగ మన్యుఁడు వ్రాయఁ గడఁగుఁ ; జాలది ; యాపై
దెగ నచ్చుఁ పిదప నందరి
కిఁ గవిత్వ'సలాడు' తుహినక్రిమిసహితమ్మై

09-11-25

బృందావన గానం - 26

ముంగాముఁజూచి విలిచెడి
కంగారున బుజ్జిగుంజు కఱకుందనమున్
రంగైన నెఱుఁగఁ జాలము
రంగారెడు నట్లె బృందరతులుం గతులున్

ఒకనికి నలిగి తొలంగియు
నకటా ! తన లేమి మరల నాహ్వానమునాఁ
జకచక లోనం దూరెడు
వికటప్రియసభ్యకృతులు వృందావనముల్

తనతపనన్ సంతమసము
ఘనముగఁ బోకూర్పఁజాలు కర్మఠుఁ డెవఁడో
వినిచిన సరిమాటలతో
ననయముఁ పదిమంది గూడ నదె బృందంబౌ

తమ విలువఁ దా మెఱుంగక
సమయానికిఁ దగిన మాటసాయముచేతన్
సముపస్థితఘనతాస్థితి
సముదీర్ణత చెలఁగు బృందసాహసికులలోన్

10-11-25

బృందావన గానం - 27

వెన్నం దినువేళలలో
వెన్నుందట్టుచును నేర్పి విలువలఁ దల్లుల్
గన్నాకు వోలెఁ దీర్తురు
వెన్నుని వలె బృందవీథి విహరింపంగన్

బృందావన మిది యందరి
కందువలం బుట్టినట్టి కలనేఁతకళా
మందారమార్దవాకృతి
పందేరముఁ జేయఁ దగిన పరమాన్నంబున్

బృందముపైఁ బట్టొకఁడికి
బృందమ్మే పట్టు నొకని విధివక్రతకున్
బృందారకగురువైనను
సందడిఁ జేయంగ లేడు ఛలశాబ్దికతన్

మన వెనుకనున్న వారును
మనమే వెనుకున్న వారు మన సరివారున్
గొనసాగిన బృందమ్ముల
మన సిరికిం బాత్ర మగును మన నడవడియే

11-11-25

బృందావన గానం - 28

తోఁచీ తోచని తొయ్యలి
కూఁచిగ మనినట్లు తోడికోడలు నింటన్
రాచటికపు లీవి నొకఁడు
వాచవిగా బృందములను వండున్ వార్చున్

బేహారికి వ్యాపారము
స్నేహారికి 'టైముపాసు' సిగ్గిడి కన్నన్
వ్యాహారాభ్యాసమ్మును
నూహాపోహలకు నెలవు లుద్యతబృందాల్

ప్రభుతయుఁ దమవంతుగఁ బ్రజ
కభిముఖముగ 'వాటుసాపు' నాహ్వానించెన్
రభసముగా నిఁకఁ గొనవలె
నభిమతముగ 'స్మార్టుఫోను' లాపై 'డేటా'ల్

స్టార్టప్పులు మిక్కుటమై
స్మార్టుగ యోఁచించు బుద్ధి చచ్చె ; ననుకృతుల్,
పార్టీలకు వలవేయుట,
యార్టిస్టులు గాను మసలు టయ్యె యువతకున్

12-11-25

బృందావన గానం - 29

తెలియమి దెలిసియుఁ దెలియని
కలనన్ నటనమ్ము ; తెలివి గల్గిన వేళన్
దెలియమిగా నటనమ్మును
బలలాస్థిన్యాయమిచటఁ బని కవిహితమౌ

హిమగిరితో సాదృశ్యమ
'హిమక్రిము'లకుఁ? 'గప్పు'నిండ నెగసినఁగానీ;
తరతమభేదము తెలియమిఁ
గ్రమక్రమముగఁ గరఁగి ముంచుఁ గద బృందమ్మున్

అభిమానుల భుజములపై
సభఁ జేయుచు నొకఁడు సెలఁగు, సాధువచస్సుల్
రభసములే యట్టిఁడునకు
నభమెఱుఁగని యట్టి బృంద మందున నభమున్

అనునిత్యముఁ బాండిత్యం
బును జూపఁగ వచ్చుఁ ; బద్యములఁ గైతలలోఁ
గనిపింపమి నార్ద్రత, క
ల్పన, సృజనము నిత్యకృత్యరచనలు రిత్తల్

13-11-25

బృందావన గానం - 30

బృందంబులలో సభ్యుల
యందము చందమును గాక యర్హతఁ గనియే
పొందికఁ జేర్చుట యుక్తము
క్రందగుటన్ మాన్ప బృందగమనములోనన్

క్రమమెఱిఁగిన బృందంబులఁ
దమమే గుణ మైన వారు తగులము గాఁగన్
జమపడినన్ నాచువలెన్
రమారమణ! నీవ బృందరమఁ గావవలెన్

అప్పుడె వ్రాయుట ; పంపుట
యప్పుడె ; చర్చలును నపుడె ; యపుడె చిదుముటల్
గొప్పగ మరునాటికి వెం
కప్పలు గూడుదురు పాము గడగడవడకన్

ఒకనాటి రాచబాటలె
యొకనాటికి దొంగదారు లో కాలమ్మా!
వికటతఁ గనఁబడనీయక
యొక బృందము నైన నిల్పవో! కృతమతివై

14-11-25

బృందావన గానం - 31

తల్లియుఁ దండ్రియు విధిగాఁ
బిల్లలఁ గారించినట్లు వేరు తలఁపులన్
జిల్లరమాటలఁ జేఁతలఁ
జెల్లునె సభ్యులకు బృందసిద్ధి చెఱచుటల్

ఒకరెండు పొత్తములఁ గని
యకటా ! యవె సర్వమనెడి యధ్యాసను , వా
మకతం బెడ వాగిన బృం
దకమ్రతయుఁ జెడును సభ్యధర్మమును జెడున్

పదిమంది రుచుల కలయిక
గద బృందం ; బొక్క డట్లు కాదని తనదౌ
ముదికోడినిఁ జినకుంపటి
వదలమి మనమైన వదలవలె బృందమ్మున్

ఒంటరిగాఁ దిరిగినచో
నంటదు వినయమ్ము గాన నందరితోడన్
జంటగ మనుటకె బృందము
లంటమి నచ్చటను వ్యర్థమగు నునికియునున్

15-11-25

బృందావన గానం - 32

కోరికల పెద్దగుట్టలు;
తీరికలే లేని గొప్పతీర్థరులు; కలం
కారీనేఁతల కోఁతలు
తీరా బృందములలోని తీఁతల్ వ్రాఁతల్

కాలక్షేపము కొఱకే
చాలా బృందములు వృద్ధజనబంధమ్ముల్
వాలాయము ప్రత్నకథా
శ్రీలయముల్ దలఁపుఁదమ్మి చెదరిన విచ్చుల్

ఎక్కటిగా నడ్మిను స్థితి
యొక్కటి బృందములఁ గొఱఁత ; యున్నపళంగాఁ
జిక్కరు యోగ్యులు; దీపపు
టిక్కను గని తగిన వారి నేర్వరచవలెన్

నా మాటయ నా శాసన
మని సభ్యులఁ బెదరఁ గొట్టి యాపై నైజ
మ్మని తన కోసమె బృందం
బును వాడికొనుట రివాజుపో! యడ్మినుకున్

16-11-25

బృందావన గానం - 33

ఒరుగులుగా బొరుగులుగాఁ
దరకలుగా శుష్కభావతతి గిరిగిరిగాఁ
దరతరములఁ గరిగరికలు
వరిపరిగలు బృందగిరులఁ బరిఁ దోఁచునుగా

వారు దరంగట్టిన మతిఁ
బారమ్మును జీరఁగోరి పలవించుచు శ్ర
ద్ధారససంవృద్ధులుగాఁ
సారెకుఁ దోచుచును బృందసాత్త్వతు లగుదుర్

త్రికరణశుద్ధినిఁ బఱగా
ద్వికరణములఁ దొలఁగఁ జేసి వీఱిఁడులవలెన్
నికరముగాఁ బలుకులలోఁ
బ్రకటించెడి క్షుణ్ణమతుల ప్రభ బృందములన్

దౌర్గాలిత్యము లోఁగొన
బార్గా తెరిచిన తలంపుపల్లఱపులతోఁ
దర్లంగాఁ గక్కూరితి
పార్లుంగద బృందకృత్యములఁ గొండొకచోన్

17-11-25

బృందావన గానం - 34

అహ మన్నది బుసఁగొట్టెడు
నహి ; కుబుసమ్మును ద్యజించునప్పుడు నైనన్
సహనము సెడి బృందంబులఁ
గుహకత గరళమ్ముఁ జిందఁ గోరుచునుండున్

వినఁదగు నెవ్వరు సెప్పిన
వినినంతనఁ బొగరుతోడ విసురులతోడన్
గనుగానమి ; బృందంబుల
మను విఙ్ఞల నొవ్వఁ జేసి మన మలరవలెన్

బందిగ మనచేఁజిక్కిన
కుందేటికి నాఁడు మూడె గురుచరణమ్ముల్ ;
పొందుగ నేఁడో రెండే ;
బృందంబుల యందొ యొకటె బేషరతులతో

అహ ముడిగిన నిహ ముడిగెడు
నిహ ముడిగినఁ బరముఁజేర నెంతయొ సులువౌ
రహి మించు బృందగతులను
నిహపరములు రెండు చెడెడు నికిలింతలతోన్

18-11-25

బృందావన గానం - 35

కొందరు పుడింగు లుందురు
బృందంబుల జగణసిద్ధిపేరిమికొఱకే
సందడి సొట్టల నూగెడు
బిందెలుగా మందిమదికి పెనువేడుకకే
(జగణము = మధ్యగురువు)

బంగరు పళ్లెరమునకున్
హంగగు నొక గోఁడచాటె యన్నట్లు; బుధుల్
రంగుల యునికిం గనఁగాఁ
బొంగుచు బృందములఁ జేరిపోదురు తమితోన్

నాఁడును నేఁడు మనస్వి
క్రీడ భువనముల నొకింత కీరితికై యీ
పాడుట యాడుట యాయా
జాడలు బృందముల బూఁచి సాచిన కోరల్

ఏదో కెలుకుట విద్వ
ద్వాదముగా నెంచి బృందదార్శనికతకున్
గాదనరాని చెదలువలె
వేదనఁగూర్చంగ నొక్క 'విబుధుం'డుండున్

19-11-25

బృందావన గానం - 36

సంఖ్యాసౌభాగ్యమునకు
సంఖ్యేయత నెఱుఁగ లేక సర్వులఁ జేర్చన్
సాంఖ్యునిఁ బోలిక నడ్మిను
సంఖ్యమె బృందముల ? ఫలము సమయుటయె కడన్

వ్యాపకమో నిజవిద్యా
ధ్యాపకమో కుదురు లేని తమ యెడఁదలకున్
జ్ఞాపకమో తెలియఁగలే
మీ పను ; లడ్మినులు, బృంద మిచ్ఛ నడుచుటల్

నేనెఱుఁగుదు నింతింతని
జ్ఞానమ్మును బంచిపెట్టు కళయా? కథయా?
ధ్యానావధానహీనత
తో నడుపుట బృందములను తుది మొద లొకటై

ఆలోచనలకు మేకులు
చాలా గట్టిగను గొట్టి సాధుమ్మన్యుల్
లీలామాత్రకవిత్వపు
జోలెన్ గొని బృందములను శోభింత్రు శరుల్

20-11-25

బృందావన గానం - 37

ఆయుష్షు పెరిగె సగటునఁ;
జేయుట కా పనులు లేవు ; ఛిద్రము లింటన్ ;
ధ్యేయము సాఁగఁగ బృందా
ధ్యాయమె పారాయణమ్మ? యతికిన్ గతికిన్

కులవాదము మతవాదము
'గులవాదము' రాజకీయకులవాదమ్మున్
సెలలై బృందంబుల నూ
కలకై మేకలను గాయు కరణిఁ జెలంగున్

మనిషికి మనిషికి మధ్యనఁ
గనిపించెడి మౌనగుహలఁ గల తమసమ్మున్
గనవచ్చును బృందమ్ముల
జనతా(అ)సహనమ్ములోని జాత్యుద్రిక్తిన్

నిదురకు వెలియై నిశిలో
గది నొంటరియై యఖండగాఢశబలతన్
మది కవలితమైన తటిన్
గదనమె గద తలఁపులందుఁ గల బృందములన్

21-11-25

బృందావన గానం - 38

తామే చక్కిలిగిలులను
ధీమాతోఁ బెట్టుకొనుచుఁ దెలివిన్ గిలివిన్
గామమ్మ మగని వలెఁ దమ
సామా నడుగుదురు వీడి చన బృందములన్

మోయఁగ లేని భరమ్మును
గూ యిడుచున్ నెత్తి కెత్తికొని 'కిండలు'గా
వేయివిధమ్ముల సణిగిన
హోయియ? బృందాధిపతుల కట్టిట్టులుగాన్

అవగాహన గల సభ్యుల
వ్యవహారమె బృందములకు నగు నగ కానీ
యవకతవకలన్ నడుచుచు
నవకటమతి నున్న లాభమా? నష్టమ్మా?

పనిలేని వెంగళులవలె
పనిమాలిన చర్చఁ జేయఁ బదుగురు గడకన్
గని యూరక యుండెడి 'య
డ్మిను' సాధింపంగ నేమి మేలు మిగిలెడిన్

22-11-25

బృందావన గానం - 39

మొగమోటము సగమోటమి
తెగ నీల్గెడివారి కడను ; దెగనీకుండన్
వగ దిగెడి పగిదిఁ దగులుట
దగు పోఁడిమి పరువుఁ గావఁ దగు బృందములన్

తనపరువు గుంపుపరు వని
తన యవమతి సభ్యజనుల దవమతి యనుచున్
గన నేరని మేధావుల
యునికియు బృందముల లోన నుద్రిక్తతయే

పాపము! విషయపు లేమిన్
గోపముతో శేషపూరకుల సంస్థితియున్
దాపమ్మే బృందంబులఁ
గాపీనము మాని వారిఁ గడ కంపవలెన్

నా బృందము నీ బృందము
జానెఁడు బెత్తెఁడునె కాని జగడపుఁ జనవుల్
తానా నీవా యనుగతి
చానా దూరమ్ము పోయి ససిపడు తావుల్

23-11-25

బృందావన గానం - 40

మన మెఱిఁగిన యర్థమ్ముల
మునుఁ గల్పనఁ జేయ బృందముల శోభిల్లన్
మన జ్ఞానమె యరకొఱ యయి
నను శాస్త్రము గీస్త్ర మైన నవనష్టమ్మే

ఒక్కఁడు కిక్కెక్కిందని
మిక్కుటముగ నంగనాచిమీఁగడపలుకుల్
దక్క మరొక్కటి వాడఁడు
నిక్కంబాతండె బృందనిష్ఠాగ్రజుఁడౌ

ఎమ్బీ లెమ్బీ లెమ్బీల్
లమ్బీకృతి నింపి ఫోను 'లాగిన్' జెడఁగా
తమ్బీ! 'జీబీ'కన్నను
'నెమ్బీ' మేలే యటంచు నెదురాడుదురా?

అటకలఁ గల పొత్తములను
చిటికలఁ గ్రిందకును దించి చెదలు దొలంగన్
బటుతరముగఁ బులికాపున
బటువును వలె నిత్యబృందపటుతన్ దోమున్

24-11-25

బృందావన గానం - 41

అంగడిలోగల గుండిగ
లం గొని యింటికినిఁ జేర్చ లావుతలంబున్
ఖ్రింగిన గతి బృందములకు
లొంగిన గల్లంతె 'ఫోను'లోఁ గల 'స్టోరేజ్'

వ్రాయుట పాడుట జతగా
నేయుట బృందములయందు నిలిచె రివాజై
కాయము గాయము గాఁగా
సాయము లేకింత 'ఫోను' జతికిలఁ బడదే!

మన'ఫోను'కుఁ 'గ్లాడు'నకున్
ఘనతర సంబంధ మింత కల్పించనిచో
గుణవంతమైన ఫోనును
వినుఁ డొక డబ్బాగ మారు విధిబృందములన్

మన సౌకర్యము కోసమె
కనిపెట్టుచు నుందు 'రాప్లు' కనుకట్టులతోన్
ఘనమని 'డౌన్లోడించిన'
మనబృందమ్మునకె కాదు మనకున్ జేటౌ

25-11-25

బృందావన గానం - 42 (అదోలా)

ఎవ్వాని వాకిట నిభమద'బృందంబు'
డేటాలు చెల్లిన చోట నాగు
నెవ్వాని చారిత్ర మెల్ల 'బృందంబులు'
నోటాలు వాడని చోట డాగు
నెవ్వాని గొనయమ్ము నొవ్వ 'బృందంబుల'
నాటుపాటల మాటు వేట సాగు
నెవ్వాని 'వైఫై'ల నింతలై 'బృందాలు'
నంటార్కిటిక నైన నడలి తూగు
అతఁడు మానవమాత్రుఁడే యన్ని ఫోన్ల
పేర్లు స్టోరేజి ఫిక్సెల్సు ఫిక్చరుకళ
కవరులు ధరలు టెంపరుగ్లాసు పవరు
తెలియు టెక్నీషియన్ గాని ; తింగరోఁడు

26-11-25

బృందావన గానం - 43

నోరో వాయో కలదని
వారినొ వీరలనొ చేర్చి ; వైపు దొలఁగినన్
దీరా పశ్చాత్తప్తత
ధీరోచితకృత్యమొకొ? సుధీబృందములన్

కుప్పలుగఁ గాయకసరులు
గొప్పగ గోతాల మీద గునియుచునున్న
ట్లిప్పుడు బృందంబులలోఁ
గుప్పలుగాఁ జేరుచుండ్రు కొసపండితులున్

కుప్పల నొకటో రెండో
తప్పక కుళ్ళినవొ పుచ్చుతాలులొ యుండున్
దప్పని దది కొనఁదలఁచిన;
ముప్పగు నా నీతి బృందముల గుంపులలోన్

ఉపబృందంబుల నాయకు
లపరిమితశ్రద్ధ మిగుల నవధానముతో
సపరిజనమ్ముగ నిమ్ముగఁ
ద్రప గిప యిసుమంతలేక తతీయన్ వలయున్

27-11-25

బృందావన గానం - 44

లలి సపరివారపత్రిక
వలె బృందములుండుఁ గొన్ని వాటినిఁ జూడన్
స్థలకాలము లెంతెంతఁగ
వలయునొ తెలియమికి మనము వసిపిల్లలమా?

చదవకయే తొలగించుట
విదితమె గద యెల్లరకును వేల్వేల్ వ్రాయన్
గుదిరికఁ బ్రతిదినమున నె
మ్మది నన్నియును చదువఁ గల మానిసి గలడే?

ననుఁ జదువరె ననుఁ జదువరె
యని ప్రతి రచయితయు రచ్చ ; యది సాధ్యమ్మే
ఘనత వహించిన వారలు
గినిసిన గద్దించి మేలుగీళ్ళేముండున్

నచ్చినవే తిందుము వి
వ్వచ్చుని యగ్రజుఁడె వండు వైనమె యయినన్
నచ్చుట నచ్చమి మనవే
యచ్చముగా ; నవ్వి పరుల యభిశంసనలా?

28-11-25

బృందావన గానం - 45

ఆధ్యాత్మికరస మిక్కడ
నాధ్యానము ధ్యేయమనుచు ధ్యాతల చేతో
విధ్యాసవమై సవమై
మాధ్యాహ్నికసంధ్యగతిని మాయంబయ్యెన్

ధనరాశిపగిది సంబో
ధనపదములు చుట్టు మూగి దండడిఁ జేయన్
గణనాథుఁడాది నిర్జర
గణములు బృందములయందు గతి సెడి సనరే!

స్వర్గమునకు బాటయు ; నప
వర్గమునకుఁ ద్రోవ ; బృందవాంఛల గిరియున్
భర్గునకు హరికి నజునకు
మార్గము లేదింక తప్పుకొన మనసైనన్

ఒకనికి వాచాలత వే
ఱొకనికి ముట్టెపొగరు నరె! యొక్క దొసంగున్
బ్రకటించిన దిద్దుకొనరు
వికటింపఁగ బుద్ధి వక్రవిధి బృందములన్

29-11-25

బృందావన గానం - 46

పలికిన కైతకు మనమే
తలక్రిందుగఁ దపము సేసి తాత్పర్యమ్మున్
దెలుపఁగ వలసిన నదియే
బలహీనత ; బృందగతుల పరువును దీయున్

అన్యము నెఱుఁగక తననే
మాన్యునిగా నెంచుకొనుచు మానవత సెడన్
ధన్యుల బాటన్ వీడుట
కన్యావరణమునఁ గొన్న 'ఘన' తమ్మలమే

జోగీ జోగీ కలయిక
భోగముగాఁ బెక్కు బృందములఁ గన్పట్టున్
సాగిన యంతటి వర కా
యూఁగాటలు దిష్టిబొమ్మ లరిఁగిన పగిదిన్

తెలియమి నేరము కాదుగ
తులనము లేనట్టి బుద్ధితో నెకసెక్కాల్
గలఁబోతలు తాలింపులు
తెలివియె? వాచాలతయును దెలివియె? తెలియన్

30-11-25

బృందావన గానం - 47

బొంబయి మిఠాయి హరువున
లంబముగా లాగి చుట్టలం జుట్టిన యా
డంబర మా సైకిలు వే
దండమ్మా? యెక్కి చూడు! దగ ; బృందములన్

అని యని యని నీ వలయుట
విని విని విని వా రలయుట వేడుకయా? పా
వనహృదయావిష్కృతి నా
ర్తి ననువుగఁ దెలుపఁ బసందు బృందము మురియున్

పిండి రవంతయు, సోడా
పిండిని దట్టించి గారె వేసిన నుబ్బున్
మెండుగఁ ; గవితయు నంతియ
దండిమగల్ బృందములను దలపెట్టినచో

మన మెంత మంచివారమొ
మన బృందము నంతె కాని మన మననములో
మన బృందము కన్న మనమె
ఘనతరులము నాఁ దలంపు గడు నేహ్యమ్మౌ

1-12-25

బృందావన గానం - 48

సతతంబు పిచ్చి చర్చా
పితామహులు కొంద ఱిందు వీరంగములన్
వెతలను గల్పించుకొనుచు
మతిఁ బోఁ గొట్టుదురు సభ్యమతిమనుజులకున్

తనతోడిదె లోకమ్మని
యనుకొనవలె సభ్యులెల్ల "రడ్మిను" గని, కా
దని వర్తించిన నలుకలు,
గనుఁగవ జేగురులు, గఱకు గద్దింపులునున్

తెలియరె మనసభలన్ నే
తలు ప్రతిపాదించు వాయిదా తీర్మానం
బుల గతి ; బృందంబులలోఁ
గల నీతులు లీతు లట్టి కథలే కలలే

ఒక తల్లి తాను పెట్టక
యొకచోఁ జే సాపనీక యున్నట్లకటా!
యొక యడ్మిను దాఁ జెప్పడు
నొకచోఁ జెప్పించుకొనుట కొప్పఁ డదేమో!

02-12-25

బృందావన గానం - 49

వారిద్ద రొక్క సంపుటి,
మీరిద్దరు నొకటి, వెన్క మేమిద్దరమున్,
బార నుభయార్థ మొక్కటి
యౌరా! సంపుటులు లావులౌ బృందములన్

ఒక యడ్మిను తెగ లాగెడు
నొక యడ్మిను లాగి తెంపు నొయ్యారముగా
నొక సభ్యుఁడు కాశీపతి
యొకఁడనఁ గన్యాకుమారి కురి బృందములన్

ఆచారనిర్ణయంబులు
నాచార్యుల నిర్ణయంబు లా తునితగవుల్
గోచారపరాపరవి
ద్యాచాణక్యములు సెలఁగు నహ బృందములన్

ప్రతివాఁడు నొక్క బోద్ధయె,
ప్రతివాఁడు దలారి, తలఁపు ప్రగ్గడయే, 'యా
నతినీయరా హరా' యని
ప్రతివాఁడుఁ దితఉవె లోపవద్బృందములన్

3-12-25

బృందావన గానం - 50

ట్యూనెఱుఁగుదు టోనెఱుఁగుదు
ఫోనెఱుఁగుదు సిమ్ముకార్డు పొడ యెఱుఁగుదు వ
ద్దాని పవరు నెఱుఁగుదు పో
యే నెవ్వఁడ? నీకు నేర్వ బృందావనముల్

మనలో మన మనుకొనుటయు
మను వాడెడివాఁడి పేరు మాధవుఁ డనుచున్
గని విని యెఱుఁగని బృందా
వనముల వనమాలి వాలివలె వరలుటయున్

గంధర్వలోకమందున
మాంధాతయుఁ జేరుఁ బ్రాసమహిమంబున వ
చ్చెం ధాత్రీపతి యని గి
చ్చుం ధన్యాత్ముఁడొకఁడపుడు సూరిస్ఫూర్తిన్

కుందేటి కొమ్ము, సుజల
స్యందము మృగతృష్ణ, సికతయందున నూనెన్
బొందందగుఁ ; గ్రమశిక్షణ
బృందంబుల సాధ్యపడునె విసివి వెదకినన్

04-12-25

బృందావన గానం - 51

దశ తిరిగిన పిమ్మటయున్
గసిగాఁ బద్యములఁ బెట్టఁ గలఁ డొక కవి; యీ
బస యాంగ్లేయుల సామ్రా
జ్యసమము ; బృందముల సవిత కస్తంగతియా?
(దశ తిరుగుట -- రాత్రి పదిగంటల తర్వాత)

వేకువ లఘుపతనకగతిఁ
జీకాకౌ 'గ్రూపు కాలు' చేయు నొకఁడు దా
నాఁకొని పద్యము వినుచుట
కై ; కృతమైత్రియును గాడె యతఁ ; డబ్బురమౌ

బుద్ధులు గ్రామ్యము లైనను
సిద్ధులు విశ్వైకమోహశీత్కారమ్ముల్
బుద్ధు లణాకానీలే
బద్ధత డాలర్ల లెక్క బహుబృందములన్

మన పాదరక్షలందున
మన కాళులు శోభనందు మనవో పరులవో
కన నేరక నర్తించిన
ఘనబృందములందుఁ బరువు గంగన్ గలియున్

05-12-25

బృందావన గానం - 52

అవివేకికి నొక నష్టమె
వివేకులకు మూఁడొ నాల్గొ వింటిమి గద వా
చవి గాని వాఙ్మధూర్మిక
లవలన బృందములయందు లావయు నెసఁగున్

మిడిమేలపు దొరకొలువున్
గడిఁ గోల్పడి మీస మొకఁడె గల ఠే చనవున్
సుడి గల 'యడ్మిను' పవమున్
గడు వేడుక బృందమందుఁ గల నవమనువున్

మన మిట్లు 'ఘనఘనాఘన
ఘనముగఁ' బద్యముల వ్రాసి కైమోడ్చుటలన్
గని యున్న భావిదృష్టిని
మని యుందుర? కడవరకును మాన్యుల్ పూర్వుల్

ఎంతగ సొగందీసిన
నంతయునుఁ గవిత్వ మగునె? యరుదౌ భావం
బెంత మనంబునఁ దోఁచిన
యంతయ బృందముల యందు నమరును సొబగై

6-12-25

బృందావన గానం - 53

పాషాణ పాక ప్రభువుల
వేషాలను వేసి వారి విద్వల్లీలా
మాషమ్ముల రుచి చెరచిన
మోషమ్మే మతికి బృందములకున్ వెతయే

పలుకును బెదవి సుభాషిత
ముల నిలు వెల్లెడల నిండ 'ఫోను'లు 'డేటా'ల్
కలనైనఁ గరము గదలదె!
పలువురిపనిఁ జేయ వెసను బనిగండమ్మా?

ఒకవందబృందములలో
నికిఁజొచ్చి మరింత రెచ్చి నిలిచినవేళన్
తునకలుగాఁ జదువుటయో
కనకయె 'డీలిట్టొ'! మనకుఁ గర్తవ్య మగున్

కొన్నాళ్లకుఁ జన్నీళ్లను
సన్నగఁ జల్లార్చి త్రాగఁ జను మేధావుల్
మన్నీలును బ్రభవిల్లెడి
మన్నన మన బృందములనె మాటికిఁ దోచున్

7-12-25

బృందావన గానం - 54

కుంతీసుతమధ్యములై
సొంతముగా ఖేటనయనసందర్శనులై
చింతాకంత నెపమ్మునఁ
బంతంబున వీడి సనరె వడి బృందములన్

రోజంత గడచిపోవు నె
మోజీ లెక్కలను వేయు మోజునఁ గడకున్
రాజెవఁడో మంత్రెవఁడో
వాజమ్మల వరుసలోన వస్తాదెవఁడో?

నవ్వులకుం బువ్వులకుం
దవ్వులకున్ రానివారి దర్శనభాగ్యం
బివ్వసుధ బృందములలో
నివ్వటిలుం గవ్వములను నిలిపిన ఘటమై

పదిమందిఁ జేర్చి, వారల
బ్రదుకులలో దూరి, మురిసి, వారల భావిన్
గదుకులు చేసెడి యడ్మిన్
బదనాయము లేని బృందపాలకుడు గదా

08-12-25

బృందావన గానం - 56

నా బృందము నా బృందము
నా బృందము చేరుఁడనుచు 'నానాగడ్డిన్'
శాబాసనుకొని కఱచుచు
'లాబీ'లను జేయు బృంద రచయిత ; యితవా?

బంగారుకాళు లుండును,
సింగారపు మొగము లుండు శ్రీగిరితరులై
లొంగితిమా? బృందమ్ముల
క్రుంగుందలఁ గాంచఁగలము కొద్ది దినాలన్

మితిమీరిన యర్మిలితోఁ
బ్రతి'పోస్టు'ను 'ఫోను'లోన బ్రతికించినచోఁ
గుతితోడఁ చెత్తకుండీ
యతికించిన తీరె యింటి ప్రాంగణమునకున్

పిచ్చుకపై బ్రహ్మాస్త్రము
కచ్చికపయి నార్ద్రకవిత కమ్మెచ్చులుగా
విచ్చిన విరిపయి నలుకయు
నచ్చక మందలలు బృందనటనము విడుటల్

9-12-25

బృందావన గానం - 57

జోలలు పాడుచుఁ బిల్లల
బెల్లించియు నిదురఁ బుచ్చు పిచ్చిజననులన్
గొల్లైన పుడమి నిద్రా
కల్లోలులు వుట్టి బృందగతులై రకటా!

అనిమిషనాథునకైనన్
గన వసములు గావు బృంద'గమ్మత్తులు' ; వే
గనులం జూడఁ గడంగినఁ
గనుకలుకలు వేపకాయ కాయింట్మెంట్లే
(కాయానికి వాడే ఆయింట్ మెంట్=కాయింట్ మెంట్)

సత్తాలాటలతోడన్
మొత్తముగాఁ బేఁట గెలిచి మురిసిన యట్లే
చెత్తగఁ జెత్తగఁ కవితా
సత్తాలన్ నడుపలేమ? సద్బృందములన్

వ్రేళులకుం దొడుగులతో
మేళము వాయించినట్లు మిడిమేలముతో
వ్రేళులు కదలుచుఁ గీబోర్డ్
పై లాస్యముఁ జేయఁ దొడుగు పట్టింపు వలెన్

11-12-25

బృందావన గానం - 55

ఉన్నది యున్నట్లన్నను
గన్నను నిది యేటి జగము గాదనును గదా
మన్నన బ్రతుకగఁ గ్రన్నన
నున్నవి లేనట్లు చూపు టౌగి బృందములన్

కలదు సుమా మఱియొక్కటి
నిలుచునె యెక్కటిగ 'ఫోను' నిలుపమె జతగా
విలిచి యొక 'పవరుబాంకు'ను;
గలుపులకై యూరియాను గైకొనినట్టుల్

'యాపులు' మిక్కుట మౌటన్
బ్రాపుగ 'డేటాయుఁ' బెరిగి పరుగుల నిడుటన్
కూపీల మూలమగుటన్
తాపీగా బృందసంఖ్య తలలకు మించెన్

ఒకఁ డులికిపడుచు లేచెడు
నొక కల బృందస్థమిత్రుఁడో యన్నట్టై
యొకఁ డసలు కునకఁ ; డతనికి
నికఁ గలలే లేవు మెలకువే నిశిఁ బవలున్

10-12-25

బృందావన గానం - 58

నచ్చుట నచ్చమి యను నొక
ముచ్చటయే గాని విషయముం గనినామా?
యిచ్చకపుఁ బలుకు సభ్యుల
బచ్చాలం జేయఁ దొవ్వ పలు బృందములన్

ఉడుపుల నుసిమిన గతిఁ , జే
మడతల వీచికలఁ జుట్టి మనిచిన గతిఁ బ్రా
మిడి సభ్యులనందరి దం
దడి చేసెడి యడ్మినొకఁడు తతబృందములన్

కవితలకుం బందిరులై
యవధానపుఁ బ్రాకులగుచు నాత్రముతోడన్
నవసాంకేతికసహకృతి
నవధానుల లెక్క పెరిగె నహ బృందములన్

అందరిపై శివమెత్తక
తొందరఁ జిరుబుర్రు లాడి తుత్తునియలుగా
బృందపు దుంపం దెంపక
సందడి నరువిచ్చునరుఁడె సరి 'యడ్మిను'గా

12-12-25

బృందావన గానం - 59

తలపోఁత లెత్తిపోఁతలు
తల దిరిగెడి కోఁత లుత్తతత్తడి పరుగుల్
వెలలేని తలఁపు తెరువులు
పలుబృందములందు సభ్యభవవర్తనముల్

అలువులఁ గల గలగలలున్
నలుగులఁ గల గిలిగిలులు మనమ్ములఁ గలలున్
గలవారల యెచ్చుల సెల
వలపల దాపలను బృందవల్లులఁ దోచున్

జూదము తగదని యనిలో
వాదునకై పలికె నాఁడె పార్థుఁడు, నేఁడా
జూదమె పాలకపాలిత
వేదమ్మగు వాటుసాపు వేదిక లందున్

తనయంతవాఁడె దేవుఁడు
తన భక్తుల కోర్కెగోల తల్లడఁజేయన్
మనఁగలడా? బృందంబులఁ
జనియుండు విదేశములకుఁ జక్కఁగ నెపుడో!

13-12-25

బృందావన గానం - 60

తఱిఁగినది సహజమేధ యం
దఱు నిఁటఁ గృత్రిమఁపు మేధఁ దలఁచి మసలుటన్
జెఱకు తుద వెన్ను పుట్టదె
జెఱకౌ గీతకును వ్యాఖ్య చెప్పిన నేయై(AI)

ఎన్నికలకు మన్నికలకు
నెన్నిక గన్నట్టి ప్రభుత కేల్బడికొఱకున్
వన్నెల వాట్సపు బృందమె
సన్నాహము ; హితముఁ గూర్ప సాధ్య మెవరికౌ

ఇంకను మైనరు వాట్సా;
పింకను సెల్ ఫోను సీనియెర్ సిటిజను కా;
దింకను టీతింగ్ ప్రాబ్లమ్స్...
ఇంకంగాఁ జేయఁ గలిగె నెన్నో బ్రతుకులన్!

సొంతము చెడినవి వాఁచీల్
తంతి కెమేరా తపాల తగ లాండ్ ఫోనుల్
వింతగ నేటీయమ్ములు(ATM)
నింతకు నరచేతి ఫోను నికిలింతలతోన్

14-12-25

బృందావన గానం - 61

ఈ మిడిమేళపు వేళల
స్వామీ! తప్పదుగఁ బవరు బ్యాంకని యనగా
నో మిత్రుండప్పుడె చొ
క్కా మరుగునదానిఁ దీసెఁ గనుపండువగాన్

ఒక్కఁడు మూర్ఖాగ్రేసరుఁ
డిక్కువగాఁ జేసికొనుచు నే బృందంబం
దిక్కువ లెఱుఁగక మసలునొ
యక్కరుణామూర్తి యర్హుఁడగు నుతియింపన్

అది యిది యని యేమున్నది
యెదలో గుబులింత పుట్టి, యేఁచి కలఁచినన్
వదవదలై యొడలంతయు
ముదిమిన్ మురిపెంపు గీతములు బృందములన్

ఇంతటితో నాపుద మని
యెంతగ నేఁదలఁచుచున్న నీ సభ్యజనుల్
సుంతైనఁ దావొసంగరె!
కంతలతో బొంతఁ గుట్టు కరణి నడుచుచున్

15-12-25

బృందావన గానం - 62

పటుబృందము వేదాంతము
చిటికెల పందిళ్ళు వేసి చెప్పుచు నుండున్
విటవిఁ బెనవేయు లతగాఁ
గటువాక్యము లల్లిబిల్లి కల్పించి వెసన్

ద్వైతాద్వైతవిశిష్టా
ద్వైతములను గలిపి రుబ్బి వండుచు గారెల్
ప్రీతిగ జైనము బౌద్ధము
మాతునుగాఁ జేయు బృందమధురిమ యొకటన్

ఆచారము గ్రహచారము
వాచాలత వాస్తవికతపై నురిత్రాళ్ళున్
గాచము సువర్ణఘనమై
తోఁచిన గతి బృందములను దోఁచుచునుండున్

కవ్వముతోఁ బెరుగును వలె
గవ్వలతో బ్రతుకుఁ జిలుకు ఘనమాంత్రికులున్
జివ్వకుఁ జే సాచుటకున్
నొవ్వరు బృందముల ; జనుల నోముల పంటల్!

16-12-25

బృందావన గానం - 63

బృంద మొకటి బృందావన
సుందరమై వేణుగానశోభల నూదున్
మందార పారిజాత
స్యందన్మధుబిందు వగుచు సరిగమ లొలుకున్

ఒక రాయిడి యొక దోయిలి
యొక వినయము నొక్క పొగరు నుచితానుచిత
ప్రకటన మొక దెస యొకచో
వికలాత్ముల మూసగోస బృందములందున్

దేవుళ్లకు నిదురండదు
భావుకులకుఁ గలఁత నిదుర పంతపుఁ గలలున్
గోవిదులకు మెలకువలును
వేవిళ్లకుఁ గ్రొత్తనోళ్లు బృందములందున్

ఇరువురికి మూడు గ్రూపులు
కలివరదుల దేశమందుఁ గలిమికి సాక్ష్యాల్
కొఱఁతయె యిక బృందములకు
విరి యొక్కటి పండ్లు రెండు వేవేల్ బీజాల్

17-12-25

బృందావన గానం - 64

అనుకరణలు ననుసృజనలు
కొనసాగింపులు పఠితలకుం దలనొప్పుల్
ఘనముగ సాగుచు బృందము
లను మోతలు గాదు గాని వ్రాతలు పొసఁగున్

ఒక గుంపున నీ రచనయ;
యొక గుంపును నదియ నాది ; యున్నపళంగా
నకళంకముగన్ వ్రాయఁగ
నకటా? నా బుద్ధి యంత 'యల్పాచ్‌తరమా'?

అతిజాగరూకతత్త్వము
ప్రతిదినమున్ వలయు మంచి రచనల కవికిన్
మతి నేమరచిన నయ్యది
ప్రతికవికిన్ స్వీయ మగును పాడియొ పాడో!

కవితల నటు వదలినచో
కవితలకే నొప్పి చోరకవులకు ముప్పా?
రవి కననివి కవి కనుటలు
సవనములై బృందతతుల సాగును 'కాపీల్'

18-12-25

బృందావన గానం - 65

పాలొకరిది తోఁడొకరిది
కాలపుఁ బసఁ బెరుగు గాఁగఁ గమ్మగఁ దినఁగన్
వాలొకరిది వీలొకరిది
'చాలా' మతలబులు బృందసౌభాగ్యములన్

బృందావనగానమ్ములు
ముందర వలె సభ్యజనుల మురిపించనిచో
నందర; భుజములఁ దడవుట
కొందఱిలో నైనఁ బుట్టు; గుతుకమె నాకున్

ఒక్కొక్కఁడు బృందంబుల
నొక్కొక గతి దారి తప్పు ; నొక్కం డొకచో
నొక్కఁడు వేరొకచో ; నిఁక
దిక్కెవ్వరు బృందములకు ది(ధి)క్కరులె గదా!

నా చక్కియు నా యుట్టియు
నా చట్టియు నాదు చుక్క నాదే యన్నన్
వాచాలా? బృందంబుల
నీ చేరికలేల? బృందనీతి విడిచినన్

19-12-25

బృందావన గానం - 66

నీ కవితయె నేఁటికి నిధి
నా కవితయుఁ గాకపోదు నాల్రోజులలో
ఆఁకలికిం దినుటయె గద
యే కాడికి? బృందగతులు నీదృక్షంబుల్

బృందముల బరువు పెరిగెను
వందారుమహాసుభక్తవాక్ప్రార్థనలన్
మందీకృతధీమంతులు
పందలకుం బ్రతుకు భయమె పరమార్థమ్మా?

నీతుల కుప్పలు వేసిరి
బ్రాఁతిగ నొకటేని నూర్చిరా? తినినారా?
యీ తత్త్వము బృందంబుల
వాతోత్థపలాలరాశి పరబోధనయే

అలఁగిన నలఁగినఁ గలఁగినఁ
గలవిషయమె పలుకువాఁడఁ గల నిల నయినన్ ;
విలువలు విడి బృందంబుల
విలువలఁ బ్రవచింపఁ గడఁక విధిలీల గదా!

20-12-25

బృందావన గానం - 67

మన విషయము జన విషయమె
యని నమ్మిన యపుడె బృందమందునఁ దెలుపం
జను ; నాది నాదె యను భా
వన గలగిన వేళ మౌనవర్తన యితవౌ

పోటీకి వ్రాసి కావ్యము
పాటకజనుఁడని తలంచి న్యాయాధీశున్
ధీటుగఁ దానే వ్యాఖ్యన్
జాటుగ వివరించు నొకఁడు సడె బృందములన్

మరియాద సుంత యెఱుఁగక
పరియాచక మాఁడు నొకఁడు పలువురతోడన్
బరిచితి యుపచితి యపచితి
వెఱపౌ బృందముల యందు విధివంచనమౌ

గారవములు తగ్గెను నా
గౌరవమును తగ్గెననుచు ఘనులు పలుకుచున్
సారెకు బృందము నుండియు
జారుట, 'తిరిగొచ్చి'పడుట సరదా సరదా...

21-12-25

బృందావన గానం - 68

వారికి వీరికి హక్కుల
పోరాటము వుట్టు వేళఁ బోరిపోరి నడ్మిన్
ధీరోచితకృత్యంబుగఁ
బారియె పోవుట హితంబు పలుబృందములన్

విదిలించియొ బెదిరించియొ
యదిలించియొ సభ్యజనుల నందర 'క్యూ'లో
విధిగా నిలబెట్టంగల
పదశీలుఁడె యడ్మినసఁగఁ బ్రఖ్యాతిఁ గనున్

ఉక్రోషము నాక్రోశము
తక్రీకృతదధివిధానఁ దగును లయింపన్
వక్రత బృందములం గనఁ
జక్రాయుధపాణికైన సాగు నవమతుల్

వగచెడి తెగబడి తడబడి
తిగలై తెగలన్ని తిర్యగ్దృక్కోణములై
పగఁబట్టి పరువు లెత్తిన
సగమై బృందమ్ము పిదప సగసగసగమౌ

22-12-25

బృందావన గానం - 69

మింటన్ బుట్టిన పూవుల
నింటింటికిఁ బెంచిపెట్టు హితకారిగతిన్
గంటిని 'నింట్రా డే షే'
రంటిన గతి బృందజాతు లమరుదురు రుచిన్

దోషములే పలికెద నని
రోషమ్ముల్ దగవు గుండెలోఁ గల భావా
వేషము గుణదోషపరీ
వేషమునం దోచు సతము బృందావనమై

ఎప్పుడు ఋణములు పెరిగిన
నప్పుడె తలవంచి నడుచు టభ్యాసమ్మౌ
నెప్పుడు వికలత పెరిగిన
నప్పుడె బృందంబు వీడు టనివార్యమ్మౌ

పందేలకుఁ జందాలకు
బృందములే సహకరించు బృహదద్భుతమై
మందలుగ సభ్యులుండిన
బృందావనరాసలీల వేడుకలేలే!!

24-12-25

బృందావన గానం - 70

మనదే కావలె కడ'పం'
చను భావన పెల్లుమీరి యల్లాడింపన్
దినమంత హృదయ మదియై
ఘనముగ నొకఁ డార్చివేయుఁ గద బృందములన్

అచ్చరలచ్చల కవితల
నచ్చముగా గ్రుచ్చి వాని నౌననిపించన్
ముచ్చటగా బృందములోఁ
బచ్చి నమస్సులను బంచుఁ బ్రజలందరికిన్

జామకుఁ బైబెరడు విడ న
సామాన్యం బైన శోభ సమకూరునటుల్
ధీమాన్యుల బృందంబుల
లో మది పై పొరలు దొలఁగ రుచి శుచి పెరుగున్

చెడు కనకని చెడు వినకని
కడు గడుసుదనమ్ముతోడఁ గాంధీ పలికెన్
సిడిమ్రానుఁ బోలు బృందపు
టడుగున కన వినఁగ లేనియవి యెన్నెన్నో.

25-12-25

బృందావన గానం - 71

ఒకఁ డుసిరికాయ తొక్కును
నొకఁడో మునగాకు కూర నొకఁడు కొళంబో
యొకఁ డావకాయఁ బప్పును
బ్రకటించును ప్రాఁతచింతపచ్చడి లెక్కన్

లంకెల బిందెల దారులు
శంకోకయించుకయు లేక చాటి వచించున్
గుంకొక్కఁడు బృందములన్
వంకల నెఱుఁగమిఁ బలువురు పరువులు పెట్టన్

సాందర్భికపదకవితా
నందులు బృందముల నిత్యనవనీతులుగా
నుందురు కొందఱు ; వారల
స్పందనకు దినోత్సవముల పట్టున నెదయౌ

కందములో నిరికించిన
కందయినన్ సిగ్గువిడిచి కండూతిమెయిన్
దందాలు చేయఁ జాలును
బృందావనగానసీమబృహదశ్వమ్మై

26-12-25

బృందావన గానం - 72

అంటులు గట్టును మూర్ఖత
వెంటన్ బడి బృందములను వికిరాన్నగతిన్
దంటాలు పడుచు సాగినఁ
గంటంబడు నలుసు పోల్కి కాలము సలుపున్

ఎరుగదు తన నలుపని మన
మరచుటయే ; యెప్పుడయిన నది తెలిపినదా?
గురిగింజ ; దోషగుణముల
పరులపయిన్ నెట్టివేయు పద్ధతి తగునా?

అట ఈపీఎస్ స్వల్పమె
యట; పీయీ రేషియో మహాధికమట ; యీ
కటుతరమగు మార్కెటుగతి
యటు నిటు బృందములయందునయినం దోఁచున్

ఇఁక నే వ్రాయవలె నవా
ర్డుకుఁ దగు గ్రంథమని పెద్దలును బల్కిరిగా
యకటా! కొనుచు నవార్డుల
నకలంకత బృందగతుల నరయఁగ నట్లే

27-12-25

బృందావన గానం - 73

పరగడుపున నతిరసములు
పరకవితావాలములకు వన్నెల్ చిన్నెల్
పరభృతభావపరీమళ
పరివర్ధితనైజకావ్యపరమార్థంబుల్

ఒకరి కెదాళం బొకరుగ
శుకపికకేకీకలాపశోభల నిలువన్
లుకలుక లేమియుఁ గలుగవు
వికటముగా బృందసింహవిధి నిలిచిననే

అవధానియుఁ బ్రాశ్నికులును
సవరణవివరణలతోడ సంచాలకులున్
వ్యవహారము సాగించుట
నవధానుల సంఖ్య పెరిగె నహ! బృందములన్

ఒకఁ డుడిగిన నొకఁడడుగును
నొకఁడాగిన నొకఁడు రేఁగు నొక తికమకతో
నొకఁడలసిన నొకఁ డులుకును
బకబకలకు బృందగానపదవులు తావుల్

28-12-25

బృందావన గానం - 74

అలకానందులు కొందరు
పిలకానందులును గొంత వీలు దొరకినన్
'అలకా'నందులు మఱియును
నలకల పిలకలకు బృంద మందున లోటా?

అందరిపై నలు కొకనికిఁ
కొందరిపై నొక్కజనికిఁ , గొలుపులు సేయన్
అందరు వలయున 'నొక'పై
కొందరికిని నలుక బృందకూటము లందున్

అందరు మహనీయు లగుట
నందరు నొక వింతవింత లగుట నెడఁదలన్
గొందరికి సభ్యులందరు
నందరు నొక్కనికి, మనన కాలంబనముల్

అన్నానని కోపముతో
నున్నానని తఱచి తఱచి యున్నది యున్న
ట్లన్నానని కినుకలతో
'మన్ననఁ' బెంచుదురు నొకట మన బృందములన్

29-12-25

బృందావన గానం - 75

ప్రాసంబుల యతుల ననా
యాసముగన్ విరుగఁ గొట్టి యటునిటుఁ బలు 'షో
పీసు'లఁ దీర్చుటయ మహో
భ్యాసకవిత్వమనఁగఁ దగుఁ బలు బృందములన్

ఒకనాఁడు నాల్గు జాములె
యొక పగఁటికిఁ గొల్త , యిప్పుడో..యొక యుగమో?
యొక మన్వంతరమో?.. స
ర్దుకొనం గలము... మరి రేయి?.. తోఁచుట యెట్లో!

స్తవములకు నగ్గు నిగ్గులు
'తవ' 'మమ' భావముల దాటు తాత్త్వికతకు, వా
స్తవములకు లొచ్చు లగ్గులు
నవు నటె బృందముల నయిన, నవి పెన్నిధులే

స్థాయిని భేదము గుంపుల
వాయిన్ భేదములఁ గూర్చవచ్చును తస్మాత్
కాయారోగ్యవిధాయిగ
ధ్యేయము సవరించుకొనుట దివ్యపథమ్మౌ

30-12-25

బృందావన గానం - 76

ఒక్కఁడు పుట్టినరోజని
చక్కఁగ నొకపోస్టు పెట్టి సభ్యుల నడుగున్
మక్కువ దీవెన లిడ మ
ధ్యాక్కరలం, బ్రకటమైన యర్థకచేష్టన్

వైవాహికస్వర్ణోత్సవ
భావావేశమ్ము లులికిపడుటకు నైనన్
గావలెను పెళ్లిసందడి
ప్రోవఁగ బృందముల రత్నముల కైతలతోన్

ఒక యడ్మిను జ్వరపడి తా
నిక బృందము వైద్యశాలనే చేయును; వా
నికి సభ్యుల సూచనములు
నొకరకమా? వేల వేలు; నూపిరిపోవన్

అసహనమతి యవిచక్షణ
పస విరిగిన పనితనమ్ము పసితన మెదియో
విసుగుందల యెటుఁ దోఁచని
రసికత బృందముల నేఁచు ప్రాయోగతియై

31-12-25

బృందావన గానం - 77

కవిశిశు వగుపించినచో
నవసరముగ నైజముద్ర నాచార్యత్వం
పు వసనము గప్పఁగఁ బురా
కవులకు బృందముల స్పర్ధ గలుగుచు నుండున్

భగణమ్మె ప్రతివాఁడును
సగమో పావో యెఱింగి సత్కవివరుఁడై
తెగ బోధలు చేయుటకుం
దెగఁబడు బృందముల మేటి తీవరకాఁడై
(భగణము = ఆదిగురువు)

తన గురువు పేరు చెప్పడు
తనపేరుం జెప్పకున్నఁ దగవులు బిగువుల్
గనరాని నలక లీ జను
లనఁగూడదు కాని బృందమందుఁ గనులలోన్

కవికర్ణకషాయమ్ములు
కవిజన'సం'జీవనములు కవిలోకకకు
బ్జవభవసాగరములు మా
న్యవశీకరణచణములగు నయ బృందంబుల్

02-01-26

బృందావన గానం - 79

ఒకనాటి బృంద విరహా
మ్మొకయుగముగఁ దోఁచి నిదుర యూసు దొలఁగఁగా
నెకసెక్కెపు వ్రాతలతో
వికలతఁ గూర్చుటయును నగుపించెడు నొకచోన్

భయభక్తులు నోసరిలన్
స్వయంప్రకట 'పెద్దటీకులు' వలసల పక్షుల్
రయముగ నుఱుకుచు నుందురు
జయవిజయుల రీతిఁ గార్యసాధకు లిచటన్

అనవలసంటిని గానీ
కని విని యెఱుఁగనివ? బుధులు ఘనతమబిరుదుల్
జను లనుకొను పద్ధతులును
గనిపించెడి వాస్తవికత కత బృందములన్

మన దీవెనలే యందరి
కిని జీవనము లను భ్రాంతికినిఁ దావలమై
మన మెగిసిపడుచు నుండిన
వినయము నటియింపఁ గలము బృందములందున్

05-01-26

బృందావన గానం - 78

ఒక రేయికాపుఁదలకై
యొక బృందమునందుఁ జేరి యుసురుసురనుచున్
నకనకలాడిన దినసరి
'సుకవిత్వ'పుఁ జేఁపు దుగ్ధశోభల నిడునే

ఈ గానము కతకమ్మై
సాగుచు మృత్తిలుదిగ్ధజలములను వలెన్
జాఁగి విశుద్ధముఁ జేయుత
రాగముఁ బెంపొంద బృందరాసిక్యమ్మున్

'అంబాలీస'నుకొని యే
కంబానికొ యాని నిలిచి గతముఁ దలంపన్
లంబగతి బృందగానము
లం బండిన భావబీజలక్ష్య మెఱిఁగితిన్

కోపముతో నడ్మినుతోఁ
దాపోక్తులు తగవులాట తగనివె యైనన్
పాపము మన పండితు లెట
దీపముపయిఁ బొగనె కాని దీపముఁ గనరే

04-01-26

బృందావన గానం - 80

జన మెఱుఁగు దాన సగమే
మన మెఱిఁగిన దని యెఱింగి మానితసభ్యుల్
జనవును మోమోటలు విడి
సనవలె బృందములఁ బూర్ణసాధనపరులై

ఎవఁ డెక్కువ యతఁడక్కున
నెవఁ డక్కున నతఁడు లొచ్చు నీ గతి నెపుడే
రవరవ గల్గిన బృందం
బవసరపడి వీడు జనుల మందర మిఁచటన్

ఎవరో పొగడుట దెగడుట
యెవరో నిర్లిప్తులగుట యెవరో నగుటల్
గవళికల పట్టి తెలియని
యవగుణులమ? బృందమందు నవమతు లేలా?

మండూకప్లుతి నొక్కఁడు
కండూత్యుపశమనకాంక్షఁ గాకుం డొకఁడున్
దిండీతిప్పలు కుదరమిఁ
'జండుం'డై మఱియొకండు సాగుదు రిచటన్

08-01-26

బృందావన గానం - 81

పేస్ట్ అండ్ కాపీ థీరీ
మాస్టర్ డిగ్రీలు కొంతమందివి; కనుచున్
వేస్టీ జీవిత మనుకొను
డస్టర్ భావనలు కొన్ని టాకులు బృందిన్

ఒక సెంచరీని గొట్టిన
క్రికెటరు బాటెత్తి చూపురీతిన్ మనమున్
ఒక మంచి పదము వ్రాసిన
'సుకలం'పు 'నెమోజి' పెట్టి చూపందగదే

ఒక్కఁడు లైకుల పిచ్చోఁ
డొక్కఁడు ఫార్వార్డు పిచ్చి యొక్కఁడు షేరిం
గొక్కఁడు డౌన్లోడింగును
నొక్కఁడు స్క్రీన్ షాట్లు తీసి యుంచుట బృందిన్

తనదైన విషయమందై
నను సంశయమందుఁ బూర్ణనైజమనీషన్
గని నిస్సంశయదశకున్
జనువారలు నరుదె! బృందసంఘాతములన్

09-01-26

బృందావన గానం - 82

డబ్బా గొట్టినఁ జాలును
దబ్బిబ్బయి యుబ్బిపోయి దబ్బున నెవియో
లిబ్బులె యబ్బిన యట్టై
మబ్బులలోఁ దేలు 'బృందమతులుఁ' గల రిటన్

ఇతరులు గొట్టమి నేమట!
యతిశయముగ బుద్ధిమంతులగు విబుధుల్ నై
జతమిస్రంబున నసకృత్
కృతభేరీపటహనివహకీర్త్యార్థటులే

అది పరమానందంబగు
నది యాధ్యాత్మికరసోత్తరాశయమె యగున్
మదిలోఁ బొంగిన తలఁపుల
నెద విరిసిన సుమము భంగి నెఁవడేన్ బొగడన్

జగ మెఱుఁగు తఱుఁగు మాటలు
వగ దోఁచెడు కొక్కిరాయి పలుకులు చెతురుల్
బిగు వుడిగిన తాలింపులు
సెగ పట్టని మంట బృందసిద్ధితపస్సుల్

10-01-26

బృందావన గానం - 83

పులుసటుకుల ధ్యానంబునఁ
జిలుముగఁ జమకమ్ములోనఁ జేగోడీలన్
నిలుపంజాలు గిరీశముఁ
బిలువం దగు నతిథిలెక్క బృందసభలలోన్

అవధానమ్ములఁ జెరచిరి
యవధానుల పేరఁ జెరచి రతని నితనినిన్
గవనము గివనముఁ జెరచిరి
యవాఙ్మనోగోచరమ్ము లా చొరబాటుల్

చొరఁబాటున కుత్సుకతకు;
గరువమునకు నాత్మనుతికిఁ ; గలి కాకలికిన్
బరువునకుఁ బట్టుదలలకు
వరుసొక్కటె యాయె బృందవాస్తవికతచేన్

ఇంకను వ్రాయం దగినవి
యింకను ఘనసైకతముల నెన్ని మిగిలినన్
శంకేతరసంకులమతి
రాంకవములు గలవు బృందరసికత మెచ్చన్

11-01-26

బృందావన గానం - 84

కంకతిక లేక దువ్వెడి
లెంకల సమకూర్చుకొనియ లేవఁగ వలె నే
వంకను బృందములం దరిఁ
బంకాగాలులకు నెగురు పత్రముఁ జేయన్

ఒక బలుపో యొక బులుపో
యొక యులిపిరికట్టె పొలుపొ యొకమెయి సలుపో
యొక నలుపుతెలుపు గెలుపో
చకచక వన్నియల మార్చు సభ్యులె సభ్యుల్

ఎవఁడే గుంపును గూర్చిన
నవసర మని దానిలోని కప్పుడె దూరన్
సవనమ్మా? దుర్బలతా
పవనమ్మా? రసవిపాకఫలజీవనమా?

గుంపు నవీనమె కానీ
గుంఫితులందరును ప్రాతకోవిదులే ఖే
శంపులె క్షణవర్తనులే
తుంపుల కలయికలె బృందదోషాకరులే

12-01-26

బృందావన గానం - 85

సాంకేతికతాభూతము
రంకెలు వేయంగ దాని రాక్షసమాయన్
గొంకును విడి పడి పోయిన
యింకుడుగుంటలకు మనకె యీ బృందమ్ముల్

తొలి 'వాటుసాపు' బృందపుఁ
గలపన జగమెల్ల నొకటిఁగాఁ జేసిన ద్ర
ష్టల మ్రొక్కంగావలె నే
యలుపులు సొలుపులును లేని యాత్మాహుతికిన్

గూగులు గుగ్గులములతో
వాగుచు సర్వమ్ము నెఱుఁగువానివలెన్ గం
గాగాఢపవిత్రత పూ
రా గలవాఁడుగ నటించు రసికుఁడు బృందిన్

శుచిచర్చ లేని శ్రాద్ధము
రుచిచర్చలు లేని విందు రూక్షేక్షణముల్
పచరింపలేని భోగము
వచనేరణ లేని బృందపచనములు వృథల్

13-01-26

బృందావన గానం - 86

ఏతాము త్రొక్కి యలసట
నీతాకుల చాపఁ బండ నెంతయొ సుఖమౌ
శీతాతపవాతాహతి
వీతాఖిలబృందమైత్రి వేదనకన్నన్

ఒక పొగడిక 'ఫాటై'(fat)నను
నొక తెగడిక 'కాలరీ(calorie)ల నుప్పునఁ గాల్చున్
'బక'నికటాటజ్జనికిని
వృకోదరునకునుఁ బసందె బృందాటనముల్

ఉడికించి యెండఁబెట్టియుఁ
బొడిచేసిన పప్పు పోహ పొట్లాలవలెన్
వడినాఁడు వ్రాసి మక్కిన
ముడిపద్యము లురుకు బృందముల నంజుడులై

మందులకును మ్రాకులకును
విందులకున్ వస్త్రములకు వేవిళ్ళకునున్
బొందుగ గ్రూపులు కట్టుట
బృందావనవిశ్వవీథిబృందాటనముల్

14-01-26

బృందావన గానం - 87

ఒక బృందములోనికిఁ బిలు
పాక ఘనసత్కృతిగ నెంచి యురుకుపరుగులన్
జకచక మని మిన్నంటెడి
వికృతమనస్కులును గలరు వృందములందున్

మన యజ్ఞానమె కానీ
మొన గల ధిషణం జెలంగు పుణ్యజను లిటన్
గనఁ దలఁచియె నిజలాభము
కొనసాగుచునుంద్రు మేటికూటస్థవిధిన్

సిద్ధాంతులు విద్ధాంతులు
శుద్ధాంతులు దంతదాంతసూనృతకథలున్
బద్ధాంతులు బుద్ధాంతులు
క్రుద్ధాంతులు బృందముల స్వగుణపూరణులే

ఉలిపిరిపొరవలె బత్తియు
నలిపిరి కడ దాటినంత నన దృశ్యంబౌ
సలుపును గద కండూతియుఁ
బలువురు భరియింప వలయు ప్రారబ్ధమ్మున్

16-01-26

బృందావన గానం - 88

తొడిమంగొని ముచ్చటపడి
యుడుకం బెట్టిన నహమ్ము నుడిగెడు దాకన్
పడి లేచి వచ్చునా రుచి
తడ వట్టిదె బృందగతుల తత్త్వముఁ జూడన్

బృందముల నింద తగదని
డెందము భావించి నపుడె , ధీకొన్న గతిన్
ముందునకు దూకు మఱియొక
చిందర ..యీ జాతిఁ గావ సిగ్గగును గదా!

కడు జాగరూకులై జను
లడుగడున సాగవలయు నదుపుల్ తప్పన్
వడి నేదొ యొక యెమోజీ
గడి నెవరికొ పంపి నాల్కఁ గఱవకుము సుమా!

మన భాగ్య మనృతకథనము
కనుకలి వినుకలియొ చెడిన కాలములోఁ ద
ప్పని తెలిసియు వ్రేళుల పని
తనమని బొంకుచునుఁ బరువు దక్కఁగొనుటకున్

17-01-26

బృందావన గానం - 89

ననుఁ బొగడఁ గూడదను న
డ్మిను మాటల గౌరవించి మెదలక యున్నన్
గనరాని కోపతాపము
లను జవిచూడంగ వచ్చు; లాభం బదియే

ఒక బృందమందుఁ జేరిన
నికరముగా దానియందె నిలువఁగ వలయున్
వికటత నటు నిటు లూగిన
నకటా! యడ్మినుల మధ్య నారని చిచ్చుల్

పదుగురితో మాటాడుట
పదుగురితోఁ గూడి నవ్వపట్టుట...యమ్మో!
ఎదుటనె యడ్మిన్ నిలచిన
నెదఁ దిగు వాక్శూలవితతి యే గతి నయినన్

సామ్యము నమ్ముచును జన
స్వామ్యమె కోరినను దగదు సతతహరితుఁడై
సౌమ్యుం డడ్మిను గలుగఁగ
ధౌమ్యుని సేవావినీతిఁ దలఁపఁగ వలయున్

19-01-26

బృందావన గానం - 90

మ్రొక్కులు సభ్యులకా? మఱి
హక్కులు?...అడ్మినులకొఱక? యను జిజ్ఞాసన్
నిక్కము నీతో నీకే
వాక్కలహముగా మెలంగవలె బృందములన్

తగినంత లవణ మనుటయుఁ
దగినంతగఁ గారమనుట తలనొప్పి గదా
తగినంతలు తెలిసినచో
వగపా బృందములఁ జూచి వంటలు చేయన్

తలఁచి తలఁచి గతము జనా
వలి విసిగింపంగఁ జేయు వాడుకకంటెన్
దొలినాటి యుపవనమ్ములఁ
గల విఱిఁగిన పుల్ల లేరు కళ నెఱుఁగఁ దగున్

కనువిప్పుఁగలుగఁ జేసెడి
గుణములు గనిపించినపుడు కుదురుగ నేర్వం
జనక యవి చూడనట్టులె
కనిపించుట గొప్పతెలివి గద బృందములన్

21-01-26

బృందావన గానం - 91

మన మన మెఱుఁగం జాలని
వనేకములునుండు బృందమందలి వాగ్వో
జనల నను గాఢవాస్తవ
మును దెలిసి మెలంగి గారమును బొందఁ దగున్

తగ వెఱిఁగిన గాంగేయులు
సగ మెఱిఁగిన ఫాల్గునులును సొంత మెఱుఁగమిన్
దగ పెరిగిన సైంధవులును
దగువారై బృందములకుఁ దప్పని భూషల్

కొందఱు 'హడావుడీకులు'
కొందఱు వ్రేలెత్తి పట్టు కూష్మాండమతుల్
కొందఱు 'సొంగూపొంగులు'
కొందఱు బృందముల ఘర్మ'కోకోకోలా'ల్

కృతమెఱుఁగుచు హృతమెఱుఁగుచు
గతమెఱుఁగుచు వర్తమానగతి నెఱుఁగుచు భా
వితమతి మేర మన యహం
కృతి నెఱిఁగించుచు మెలంగమే! బృందములన్

22-01-26

బృందావన గానం - 92

డేటాసెంటరు వ్యయమున
వాటముగా వాటుసాపు వాటా యుండున్
పోటీగా మనవాటా ;
యేటా యెంతెంత ఖర్చొ యివి దాఁచుటకై

అప్పటి భోషాణమ్ములు
నప్పటి యటకలునుఁ బురులు నా పాతరలున్
గొప్పగ నేటికిఁ గుదిరిన
వప్పనముగ బృందములుగ నన్నియు దాఁచన్

కొన నేఁగి యొకటి, పది కొను
ఘనసంస్కృతి మనకు నేర్పఁ గలిగెను 'మాలుల్'
మనమా తక్కువ తినునది
మన బృందములందుఁ గూడ మన గాన మదే

ఒకక్కడు పది వ్రాయించిన,
నొకక్కడు శత మనును, వేయి యొక్కం, డిట్టుల్
గుక్కిన లక్షలు కోట్లుగ
దిక్కేదికఁ 'గ్లాడు'కైన దిక్కుల కయినన్

23-01-26

బృందావన గానం - 93

సామాజికనిస్స్పృహతో
భూమాధికదివ్యభావపూరణరతితో
నీ మనబృందము నింపిన
నే మగు నిసుమంత లాభ మెవ్వరికేనిన్

'మాలు'ల మాలలఁ గని గని
'మాలు'ల లక్షణము లబ్బి మన 'యడ్మిను'లున్
వేలున్ వందలు పదులున్
జాలని దశఁ జేరినారు 'స్వర్థా'ళువులై

ఏద్దైనఁ జేయవచ్చును
బోధించుట తప్ప బృందములఁ బొరపాటుల్
వాద్దైనఁ గాయవచ్చును
వేదమ్ముల పేరుచెప్పి విధిగా నిధిగా

పుల్లా పుడకా యమ్ముచు
నల్లన 'బ్రతుకెళ్ళఁ'దీయు నాటవికగతిన్
గొల్లగ 'డేటా' యమ్ముచు
నల్లరిగా బ్రతుకు నొక్కఁ డయ్యో రామా!

24-01-26

బృందావన గానం - 94

డేటాబేహారులతోఁ
బూటుగ నిండినవి బృందములు రసికతచే!
మీటఁగవలె నేదో కొనఁ
జేఁటగు లేకున్న భావి శ్రేయమ్ములకున్

మనగూరిచి సర్వమ్మును
మనకన్నను ముందెఱుంగు మనుజుల కలిమిన్
జనమాన్యత మనకబ్బుట
గుణమో? దోషమ్మొ? యెచటికో పయనమ్మో!

మన యనుమతి లేకున్నను
మన 'నంబరు' వాడుకొనుట మన ప్రభుతకునున్
గనిపించఁగ న్యాయమ్ముగ
మనలనుఁ గాపాడువారు మన కెవ్వరికన్

అరికట్టఁ దగినవారలు
నరిమురిఁ 'డెక్నాలజీ'ని నపరోక్షగతిన్
వరరాజకీయలబ్ధికిఁ
బరనిందకు వాడ దిక్కు ప్రజ కెవ్వ రిఁకన్

25-01-26

బృందావన గానం - 95

మనమేమొ 'మెహర్బానీ'
యనుకొని 'సెల్ నంబ' రివ్వ నదియే మన ము
క్కున మన వ్రేలయి దోపిడిఁ
జని కొంపలఁ గూల్చఁ గలిగెఁ ; జా లీ ప్రగతుల్!

అడిగినదే తడవుగ మన
మడుగడుగున 'నంబ'రిచ్చి 'యాధా' రి'చ్చీ'
వెడఁగులమై వర్తిల్లిన
జడు పేటికి దోపిడీకిఁ జనవై నిలువన్

సర్వప్రాణులు గూర్కెడి
శర్వరి మేల్కాంచు విబుధసహచరితత్వం
బుర్వర బృందంబులనే
కుర్వజ్జనములకు దక్కు కుమతుల కెక్కున్

దినములు దినోత్సవములును
బెనుగండమె బృందములకుఁ బేరంటములం
దున నిచ్చి పుచ్చుకొను వా
యనములవలెఁ దనువుఁ దన్వి యలసటఁ బెంచున్

27-01-26

బృందావన గానం - 96

అలఁగఁ దగు నప్పుడప్పుడు
నలుఁగులఁ గలుఁగులను దాటు నంతటి కోపం
బులతో విభిన్నరూపం
బులతో నల్మినులు బృందముల లుకలుకలన్

అలిగిన వేళనె కనవలెఁ
గలగా పులగమ్ములైన కవళికల మొగం
బెలయించు బృందసభ్యుల
కలలం గలవరముఁ గూర్చి కాల్దన్నుటలన్

'నా వృందమందుఁ జేరెను
నా వాఁడే' ; 'కాఁడు కాఁడు నాలో వాఁడే'....
యీ వైఖరు లల్మినులన్
జేవల నలయించుఁ బరువుఁ జేర్చును గంగన్

తనతో నెల్లన్ శిష్యులఁ
గొనిపో వ్యాసుండు భిక్షకును ననుమతికై
జననినిఁ గోరెను, నేఁడ
ల్మినులున్ జనుచుందు రట్లె మేళనవేళన్

28-01-26

బృందావన గానం - 97

నీళ్లన్ వ్రేళ్లన్ గొట్టుటఁ
గళ్లింతలు చేసికొనుచుఁ గాంచినయట్టుల్
మళ్లీ మళ్లీ బృందపుఁ
ద్రుళ్లింతలఁ జూడ నెడఁద తొందరఁ గొనెడిన్

ప్రతిసృష్టి చేయగలిగియు
మెతు కనుకొని యెమ్ము గొఱుకు మేదకుని వలెన్
వ్రతులై నలువురి దిద్దెడి
హితులున్ గతుకులను బడరె బృందములందున్

'కంటిన్యూ' వ్రతదీక్షులు
'మెంటల్ న్యూ'రాగభావ'మెలడీ'రతులున్
'ఫెంటాస్టిక్' పదబంధులు
'సెంటర్ ఫ్రెష్' ప్రియులు 'మింటు' చేష్టలు నొకచోన్

రుదితముపై ముచ్చట గొని
వెదకుకొనున్ హేతువొకఁడు విధి యని నిచ్చల్
పెదవులపై దరహాసపుఁ
బొదకై కారణము వెదుకఁ బూను నితరుఁడున్

30-01-26

బృందావన గానం - 98

రాపాడును గాల్పనికత
కాపాడును వాస్తవికత కాని సుజనుఁడున్
ద్వీపీకృతబృందస్థత
రూపొందిన వాస్తవమ్ము రూక్షముగఁ గనున్

నలుగురి నాలుగు చేతులు
ఫలసిద్ధికి వలయుఁ గార్యభారపు వేళన్
లలిఁ గొందరు పనిసెడఁ జే
తులు పది చిచ్ఛక్తి వేయుదురు బృందములన్

ఒక ఫలమునఁ దాంబూలము
నొక కరమున వందనమ్ము నొక బృందమ్మే
యకమునకుం దావగుటయు
నకటా! వర్జింపఁ దగిన వను 'నెటిజనుఁ'డున్

బృందములం బ్రకటనలున్
బొందుగ 'హాండ్ మేడు' లిచ్చు పూనిక కలుగన్
వందలొ వేలో దొరకవె
మందకుఁ బోటీలు పెట్టి మరిగించినచోన్

31-01-26

బృందావన గానం - 99

అనువాదము మూలమునకు;
ననుగానము వాదమునకు; ననుకరణమ్మున్
కొనసాగింపులు నాపైఁ....
దనువుల్ పులకించు బృంద తత్త్వము లరయన్

దొరకని దన నేముండదు
దొరకొని యట దేవులాడ దోషమొ గుణమో
పరమాత్మతత్త్వముం బలె
విరివిగ బృందముల భిన్నవిధములు దొరకున్

ఎదుగుఁదల నాప వలవదు
పదుగురి సౌభాగ్యసిద్ధిపథ మది కానీ
యెదుగుఁదల పేరఁ గొందరె
పదుగురి తలఁదన్నియుంట ప్రగతిపదమ్మా?

బృందము లనితరసాధ్య మ
నందగు నభివృద్ధిఁ గాంచినవి కానీ పొం
దందగు సౌహార్దము నం
దం దలపెట్టమిని విఫలతం బొందినవే!

01-02-26

బృందావన గానం - 100

పలునాళ్ళముందె తమ తమ
కలములఁ బులికాపు సేసి, కసి ; నా యా రో
జులు గదిసిన వేళన్ గవి
తల కుప్పలఁ గుప్పఁ గవులు తలకరు బృందిన్

వలదని సన్మానమ్ములు
వల సెడి యడ్మినులు పలుకవచ్చును, గానీ
యలవాటువాట మది యని
తెలిసియు తెలియమి నటించి దెగఁ జేయవలెన్

లోటాకుఁ దక్కువైనను
వాటా చెడకుండ నీరు వంచినరీతిన్
మాటల మిగులుచు బృందపు
టాటాడుట కొంతమంది కవు నిత్యమ్మున్

కులమతవిద్వేషమ్ములు
గలవు సమాజమ్మునందుఁ గలకాలముగాఁ
దలమా? తొలగింపఁగ మా
టలఁ? బృందములందుఁ బెంచుటలు మాననిచో

03-02-26

బృందావన గానం - 101
(వి)/(స) ఫలశ్రుతి-1

బృందావనమే గురిగా
బృందావనగాన మిట్లు వినిపించితి నే
బృంద మయినఁ గినిసినచో
బృందస్థులె యూరడింపు విధిఁ జేయఁ దగున్

అలనాటినుండి కవిమును
లలవోకగఁ జూచి తెలిపి రా యీ లోకం
బుల తత్త్వంబుల ననువగు
విలువలతో విoగడించి విష్వగ్సృష్టిన్

లోకము విభిన్నరుచికము
శోకాకుల మనెడి భ్రాంతిఁ జుంబితమును నా
లోకమునన్ రెప్ప నదిమి
వీఁకను విడి చీఁకటి యను వేదననె గనున్

మనమా మానవులము న
మ్మని విషయమ్ములను గూర్చి మధురమ్ముగఁ బ
ల్కని యొకవింత ధిషణ నెం
తని మాటాడంగఁ గలము తనువులు దీరన్

07-02-26

బృందావన గానం - 102
(వి)/(స) ఫలశ్రుతి-2

కనులందోఁచని రాగము
మనలోనం గానరాని మమతల ధురమున్
గణియింప నౌనె మాదృ
గ్జనముల కొక యింతయేని చని బృందములన్

ఇవి యేనున్ సతతంబును
గవి కిష్టము లగును భావుకతయున్ రసమున్
దవిలిన సమాజసౌఖ్యము
సవనీకృతనీతి ధర్మసాన్నిధ్యంబున్

ఓపికతోఁ జదువుటయును
నోపమి సైరించియుంట యుద్వేగమునం
బాపముఁ దలంచి యోర్చుట
యీ పాటిది నా వచింప నెవ్వఁడు సెల్లున్

లోపమ్ములు పుట్టువులన్
రూపొందుట సాజమని నిరూఢియ ; నడతం
గాపట్యము గుడియెడమల
శాపము లోపమ్ము గాదు సరివారలలోన్

09-02-26

బృందావనగానం

ముగింపుపద్యం

ఒక్కరినో యిద్దరినో
చక్కఁగఁ గుంకీలఁ జేసి సభ్యుల నెల్లన్
దుక్కులుగాఁ గనఁ గలిగిన
దక్కును బృందాధిపతిత ధన్యతయుఁ దగన్

బృందంబులు బృందేశులు
బృందస్థులు చెడిన పిదప బృందస్థితికై
డెందంబుల చీకటిలో
నం దడవెడి నాశలకు వినమ్రత యితమౌ!

బృందావన గానం ధారావాహికంగా వివిధ వాట్సాప్ గ్రూపులో వస్తున్నప్పుడు కొందరి ప్రతిస్పందన ఇది.

చక్కని మీ కందమ్ములు
మక్కువతో చదివినట్టి మాన్యుల మదికిన్
మిక్కుటముగ సంతోషము
నిక్కముగాకలుగజేసి నిలుచునుభువిలో.

అలవడిన పద్యవిద్యను
సులభముగా సూక్ష్మములను సూక్తులుజేయన్
తలపడిన శ్రీనివాసున
కెలమిన్ వందనముజేతు ఎంతయు శ్రద్ధన్

- మోహన్ రావు

తీరుగ నాంగ్ల భాషయును తెల్గును జేయును భావమొప్పగన్
మేరువు రీతిగా నిలుచు మేలగు వాక్యపు కూర్పులందునన్!
వేరుగ జెప్పగా తరమె! వేంకట నాయకు నండనుండగన్!
సూరము శ్రీనివాసులన సూటిగ వేయును పద్యబాణముల్!

- టేకుమళ్ల వెంకటప్పయ్య

మందానిలసదృశంబులు
నందకుమారార్పితమగు నవనీతంబుల్
బృందావనగానమ్ము ల
మందానందజనకములు మాన్యవరేణ్యా!

డి. వి. ఎస్. శాస్త్రి

ప్రతిపద్యపు భావంబున
హితములు సత్యములు గనగ హెచ్చెరికలతో
మతి గలుగగ నెల్లరకును
సుతిమెత్తగ తెల్ప, నతులు సూరము సుకవీ!

అన్నియు నిష్ఠుర సత్యము
లన్నన! నెవరేమనుకొన నందరి యందు
న్నున్నివి చెప్పి రనుకొనగ
నన్నలు తమ్ములు తలచగ నదె మేలునగున్.

చరవాణిక్రొత్తపోకడ
లు రసమొలుకురీతిఁ జెప్ప రూఢిగ కైతన్
నిరతము నందిరికథయై
పరగుచు నండగ నిలిచెను పచ్చినిజాలై

- పెద్దింటి లక్ష్మణాచార్యులు

పటుతరమగు కందమ్ముల
నిటులన్ ఈనాటి గతుల నిమ్ముగ జెప్పన్
మెటికలు విరువదె కణతల
పుటుకున శ్రీవాణి ముదము పొల్పగ సూరీ

కందమునందున హితవులు
అందముగా పొదిగి నటులె అద్భుత పదముల్
పొందించి పద్యమల్లుట
విందగు గద విజ్ఞలకును విద్వత్సుకవీ

కాలపు మార్పుల లీలలు
హేలగ చరవాణి బృంద హితులెల్లరకున్
మేలుగ జెప్పెడు సూరీ
వేలుగ దండాలు మీకు వినయము తోడన్

- తుమ్మూరి రామమోహనరావు, సిరికోన

అవలీలగ గుది గ్రుచ్చిరి
వివిధంబగు బృందములిడు విన్యాసములన్
వివరంబుగ పడు పాట్లున్
కవనమ్మున నద్భుతమ్ముగా గురువర్యా

వందల కొలంది పద్యము
లందున పునరుక్తి లేని యాలోచనలన్
బృందాల నిగ్గుదేల్చిరి
వందనము గొనుమ శ్రీనివాస గురువరా!

చదివిన వారలకెప్పుడు
ముదము కలిగి కొన్ని బృందములకడ్మినులై
సదసద్వివేకమున రస
హృదయలకానందమొసగి తృప్తి బడయరే

ఒక్కడె యడ్మినుడుండును
పెక్కు రమాయకపు గోప బృందమునకు తా
నొక్కడగు కృష్ణునివలెన్
మ్రొక్కిన వారలకె బృందమున చోటుండున్

- డా. పి బి డి వి ప్రసాద్